RNI NO : TELTEL/2023/89146

Telugu Daily

శెనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగుదినపత్రిక సంపుటి :3 సంచిక:253 ఆదివారం 01 నవంబర్ 2026 పేజీలు :8 వెల రూ.5

Published from : Karimnagar Circulated to : Adilabad, Warangal, Hyderabad, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad, Rangareddy

రిపోర్టర్లు కావలెను



జర్నలిజంలో ఆసక్తి ఉన్న వారికి

శెనార్తి మీడియా

ఆహ్వానం పలుకుతుంది

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లలలో సంప్రదించగలరు.

77309 83966 98491 98098

జ్ఞానేశ్ కుమార్ పై 'ప్రజా అభిశంసన'



- ప్రతిపక్షాల ప్రత్యామ్నాయ పార్లమెంట్!
- ఢిల్లీలో ఇండియా కూటమి నిరసన
- ఖర్గే నివాసంలో మాక్ పార్లమెంట్
- సభాపతిగా మాజీ స్పీకర్ మీరా
- తీర్మానం ప్రవేశపెట్టిన మల్లికార్జున ఖర్గే
- సోనియా, రాహుల్ సహా ప్రతిపక్ష అగ్రనేతల హాజరు

4

నింగిలో మరో విజయం

- జీఎస్ఎల్వీ-ఎఫ్18 ప్రయోగం
- ఇస్రోకు మోదీ ప్రశంసలు
- నిర్దేశిత కక్ష్యలోకి ఎన్వీఎస్-03 నావిగేషన్ ఉపగ్రహం
- శాస్త్రవేత్తలు, ఇంజినీర్లకు ప్రధాని అభినందనలు



భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో కీలక ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగించిన జీఎస్ఎల్వీ-ఎఫ్18 రాకెట్ ఎన్‌వీఎస్--03 నావిగేషన్ ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టినట్లు తెలిపింది.



యువతుల అండాలతో దందా

- ఉద్యోగాల కోసం వచ్చిన వారే లక్ష్యం
- ఒక్కొక్కరికి రూ.30 వేల చెల్లింపు
- హార్మోన్ ఇంజెక్షన్లతో ప్రాణాలకు ముప్పు
- ప్రకాశ్‌నగర్, సరూర్‌నగర్, గోపాల్‌పురం హాస్టళ్లపై పోలీసుల దాడులు

3

- 49 మంది యువతులకు విముక్తి.. 8 మంది నిందితుల అరెస్ట్

యువతుల ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకుని అండాలను అక్రమంగా సేకరించి విక్రయిస్తున్న ముఠా వ్యవహారం హైదరాబాద్‌లో వెలుగుచూసింది. మల్కాజ్‌గిరి స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్ఓటీ), బేగంపేట, సరూర్‌నగర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో ఈ అక్రమ దందా బయటపడింది.

తుమ్మిడిహెట్టి ముంపుపై మాస్టర్ ప్లాన్!

- మహారాష్ట్ర అభ్యంతరాల పరిష్కారానికి సాంకేతిక వ్యూహం
- పర్యావరణానికి ముప్పు లేకుండా ఇంజినీరింగ్ డిజైన్
- వాస్తవ ముంపుపై పక్కా మ్యాప్‌లు సిద్ధం చేయాలి
- ఉత్తమ్ సమీక్ష

హైదరాబాద్, అక్టోబర్ 31 : ప్రతిపాదిత తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై పొరుగు రాష్ట్రం మహారాష్ట్ర వ్యక్తం చేస్తున్న ముంపు, పర్యావరణ సంబంధిత ఆందోళనలకు సాంకేతికంగా సమర్థమైన, ఆచరణసాధ్యమైన పరిష్కారాలు రూపొందించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు సాగునీటి లక్ష్యాలకు ఏమాత్రం భంగం కలగకుండా, పర్యావరణ ప్రభావాన్ని తగ్గించేలా ఇంజినీరింగ్ మార్పులను పరిశీలించాలని ఆయన సూచించారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో ఇటీవల జరిగిన చర్చలకు కొనసాగింపుగా బ్యారేజీ

మిగతా 2 లో



ఇస్రో శాస్త్రవేత్తలకు సీఎం రేవంత్ అభినందనలు!

2



ఎలక్ట్రానిక్స్ తయారీలో

అగ్రగామిగా తెలంగాణ!

- తుక్కుగూడ ఈ-సిటీలో 'మివి' ఎలక్ట్రానిక్స్ ప్లాంట్ ప్రారంభం
- రూ.200 కోట్లతో అత్యాధునిక మాన్యుఫాక్చరింగ్ ఫెసిలిటీ ఏర్పాటు
- పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేస్తున్నామన్న మంత్రి శ్రీధర్ బాబు
- చిప్ డిజైన్, సెమీకండక్టర్ల ఉత్పత్తిపై రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక దృష్టి

ఎల్‌నినో ఎఫెక్ట్.. తాగునీటికి ప్రత్యేక నిధులు!

నీటి ఎద్దడి రాకుండా ముందస్తు ప్రత్యామ్నాయ చర్యలు

- సింగూరు పరిధిలోని నాలుగు జిల్లాలకు రూ.120 కోట్లు
- మిగతా జిల్లాలకు తక్షణ అవసరాల కింద రూ.కోటి
- మంత్రి సీతక్క

2



నగరంలో గ్రీన్ ట్యాంకర్లు

నవంబర్ 1న ప్రారంభం!

- సీఎస్ సంజయ్ జాజు ఆదేశం



2



హైదరాబాద్‌లో భారీ సైబర్ మోసం!

- రూ.24.76 కోట్లతో నకిలీ ట్రేడింగ్ దందా
- ప్రధాన నిందితుడు అలంరాజు ఇళ్లు, ఆఫీసుల్లో ఈడీ సోదాలు

3

- నకిలీ వెబ్‌సైట్‌తో పెట్టుబడిదారుల మోసం
- రూ.5 కోట్ల విలువైన ప్లాట్లు, విల్లా గుర్తింపు
- రూ.6.40 లక్షల నగదు సీజ్.. 11 ఖాతాల ఫ్రీజ్

రేవంత్ 'క్రెడిట్ చోరీ'



వేల కోట్ల భూములను కాపాడింది మేమే..

- సీఎం రేవంత్ రెడ్డి మాటలన్నీ అర్ధసత్యాలే
- గ్రేహౌండ్స్ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారు
- కోర్టు తీర్పుల కాపీలు బయటపెట్టిన హరీశ్ రావు

3 పేజీలో

పటేల్ ప్రధాని అయి ఉంటే.. దేశ దశ మారేది!

3



- కాంగ్రెస్ తీరుపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఫైర్



యాదాద్రి శ్రీవారి సేవలో గవర్నర్ దంపతులు!

2

ఈవీఎంలపై డౌటుంటే..

అసెంబ్లీని రద్దు చేయండి!

- సీఎం రేవంత్‌కు కేంద్ర మంత్రి బండి సంజయ్ సవాల్
- బ్యాలెట్ ఎన్నికలకు మేం సిద్ధమని ప్రకటన

3



ఇస్రో శాస్త్రవేత్తలకు సీఎం రేవంత్ అభినందనలు!

ఎన్ఎస్వీ-03 నావిగేషన్ ఉపగ్రహ ప్రయోగం సక్సెస్

ఇస్రో చరిత్రలో ఇదొక కీలక మైలురాయి

భారత నావిగేషన్ సామర్థ్యాలు మరింత బలోపేతం

కీలక రంగాల్లో మెరుగైన సేవలు అందుతాయని ఆకాంక్ష



హైదరాబాద్, అక్టోబర్ 31 : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) జీఎస్ఎల్వీ-ఎఫ్-18 రాకెట్ ద్వారా ఎన్ఎస్వీ-03 నావిగేషన్ ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించిన సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సిబ్బందికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఉపగ్రహాన్ని నిర్దేశిత భూస్థిర కక్ష్యలోకి దిగ్విజయంగా ప్రవేశపెట్టడం భారత నావిగేషన్ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే ఓ కీలక మైలురాయి అని ఆయన ప్రశంసించారు. ఈ ప్రయోగం ద్వారా దేశంలో రవాణా, విమానయానం, సముద్ర నావిగేషన్, నిరంతర పర్యవేక్షణ, అత్యవసర సేవల వంటి కీలక రంగాల్లో ఎన్ఎస్వి-03 ఉపగ్రహం మెరుగైన సేవలు అందించనుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ అద్భుత విజయం యావత్ దేశానికి ఎంతో గర్వకారణమని కొనియాడారు. భవిష్యత్తులో ఇస్రో ఇలాంటి మరిన్ని అద్భుత విజయాలు సాధించి దేశ ఖ్యాతిని దశదిశలా చాటాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

యాదాద్రి శ్రీవారి సేవలో గవర్నర్ దంపతులు!

లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న శివ ప్రతాప్, జానకి శుక్లా

దేవస్థానం 2027 నూతన వార్షిక క్యాలెండర్ ఆవిష్కరణ

పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



యాదాద్రి, అక్టోబర్ 31 : గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ఆయన సతీమణి జానకి శుక్లా శనివారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకున్నారు. శ్రీ జనార్దనానంద సరస్వతి స్వామి సంస్కృతి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి కొండపై ఘనంగా జరుగుతున్న తెలంగాణ వేద విద్వన్మహాసభల ముగింపు వేడుకలకు గవర్నర్ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గర్భాలయంలో కొలువుదీరిన స్వయంభువుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి దర్శనానంతరం ఆలయ ముఖమండపంలో పండితులు వేదమంత్రోచ్చారణల నడుమ గవర్నర్ దంపతులకు వేదాశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా యాదాద్రి దేవస్థానం ప్రత్యేకంగా ముద్రించిన 2027 నూతన వార్షిక క్యాలెండర్‌ను గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆవిష్కరించారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ఆలయ ఈవో భవానీ శంకర్, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డల రక్షణ.. అందరి బాధ్యత!

వేధింపులను చూసీచూడనట్లు వదిలేయొద్దు

లింగ వివక్షపై యువత ధైర్యంగా నిలదీయాలి

మహిళా భద్రతా విభాగం డీజీ చారు సిన్హా

హైదరాబాద్, అక్టోబర్ 31 : మహిళల భద్రత పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ సామూహిక బాధ్యతగా గుర్తించాలని మహిళా భద్రతా విభాగం డీజీ చారు సిన్హా అన్నారు. వేధింపులు, లింగ వివక్ష లాంటివి ఎదురైనప్పుడు మౌనంగా ఉండకుండా యువత ధైర్యంగా ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ పోలీసు మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమంలో భాగంగా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. మహిళల రక్షణకు చట్టాలు మాత్రమే సరిపోవని, సమాజ ఆలోచనా విధానంలో కచ్చితమైన మార్పు రావాలని ఈ సందర్భంగా చారు సిన్హా పేర్కొన్నారు.



ఆరు నెలల్లో 2 వేల మందికి శిక్షణ..

ఈ శిక్షణలో భాగంగా నాలుగు బ్యాచ్‌లుగా 250 మందికి పైగా అధ్యాపకులు, విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు తమ కళాశాలల్లో అవగాహన తరగతులు నిర్వహించనున్నారు. తద్వారా రాబోయే ఆరు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా 2 వేల మందికి పైగా యువతను చైతన్యవంతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఓయూ వీసీ ఆచార్య కుమార్ మొలుగారం మాట్లాడుతూ.. విద్యాసంస్థల్లో భద్రతతో కూడిన వాతావరణం కల్పిస్తున్నామని, క్యాంపస్‌లో 1,500 మంది విద్యార్థినులకు వసతి కల్పించేలా ప్రత్యేక హాస్టళ్ల నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు.

తుమ్మిడిహెట్టి ముంపుపై మాస్టర్ ప్లాన్!

(మొదటి పేజీ తరువాయి..)

సాంకేతిక అంశాలు, ప్రతిపాదిత అలైన్‌మెంట్లపై మంత్రి తన క్యాంప్ కార్యాలయంలో శనివారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

వాస్తవ ముంపుపై సమగ్ర మ్యాప్‌లు..

బ్యారేజీలో వివిధ జలాశయ నీటిమట్టాల వద్ద ప్రభావితమయ్యే భూముల విస్తీర్ణాన్ని సమగ్రంగా అంచనా వేయాలని మంత్రి ఉత్తమ్ అధికారులకు స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో వాస్తవంగా ఎంతమేర ముంపు ఏర్పడుతుందో నిర్ధారించేందుకు వివరమైన పటాలు (మ్యాప్‌లు) సిద్ధం చేయాలని ఆదేశించారు. నదీగర్భ ప్రాంతాలు, అటవీ భూములు, పర్యావరణ సున్నిత మండలాలు, సంరక్షిత కోర్ ప్రాంతాలు, రెవెన్యూ భూములు, జనావాసాలను ఆ పటాల్లో స్పష్టంగా గుర్తించాలని సూచించారు. ఈ కచ్చితమైన వివరాల ఆధారంగా మహారాష్ట్ర వ్యక్తంచేస్తున్న ఆందోళనలను పరిష్కరించే మార్గాలను పరిశీలించాలన్నారు.

టార్గెట్ 152 మీటర్లు..

ప్రాజెక్టులో నీటి నిల్వను, వినియోగాన్ని మరింత మెరుగుపరిచేందుకు తుమ్మిడిహెట్టి పూర్తిస్థాయి జలాశయ



నీటిమట్టాన్ని (ఎఫ్ఆర్ఎల్) 148 మీటర్ల నుంచి 152 మీటర్లకు పెంచాలని తెలంగాణ ప్రభుత్వం గట్టిగా ప్రతిపాదిస్తోంది. ముంబైలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో ఈనెల 26న జరిపిన సమావేశంలో ఈ ప్రతిపాదనపైనే ప్రధానంగా చర్చించిన విషయం విదితమే. ప్రస్తుతం ప్రతిపాదిత 148 మీటర్ల నీటిమట్టం వద్ద నిల్వ సామర్థ్యం కేవలం 2.182 టీఎంసీలు కాగా.. దానిని 152 మీటర్లకు పెంచితే 5.697 టీఎంసీలకు చేరుతుంది. తద్వారా నీటి నిల్వ సామర్థ్యం రెట్టింపునకు మించి పెరుగుతుంది.

5.85 లక్షల ఎకరాలకు సాగునీరే లక్ష్యం!

ప్రతిపాదిత 152 మీటర్ల నీటిమట్టం వద్ద కూడా ముంపు పరిమితంగానే ఉంటుందని ప్రాజెక్టు ప్రాథమిక అంచనాలు సూచిస్తున్నాయి. తెలంగాణ, మహారాష్ట్రల్లో పునరావాసం, పునఃస్థాపనకు (ఆర్ అండ్ ఆర్) సంబంధించిన అవసరాలను సులభంగానే పరిష్కరించవచ్చని ఈ అంచనాలు పేర్కొంటున్నాయి. సుందిళ్ల బ్యారేజీ, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుతో కూడిన సమగ్ర వ్యవస్థ ద్వారా ఏకంగా 77 టీఎంసీల నీటిని మళ్లించి ఏడు జిల్లాల పరిధిలోని 5.85 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. కాగా, ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ.శ్రీధర్, ఇంజినీర్ ఇన్ చీఫ్ (జనరల్) ఓ.వి.రమేష్‌బాబు పాల్గొన్నారు

తాగునీటికి ప్రత్యేక నిధులు!

- **నీటి ఎద్దడి రాకుండా ముందస్తు ప్రత్యామ్నాయ చర్యలు**
- **సింగూరు పరిధిలోని నాలుగు జిల్లాలకు రూ.120 కోట్లు**
- **మిగతా జిల్లాలకు తక్షణ అవసరాల కింద రూ.కోటి చొప్పున మంజూరు**
- **అధికారుల టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి సీతక్క దిశానిర్దేశం**

హైదరాబాద్, అక్టోబర్ 31 : ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి ఎద్దడి తలెత్తే పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తుగా ప్రత్యేక నిధులను మంజూరు చేసిందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి డాక్టర్ సీతక్క తెలిపారు. సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో సింగూరు ప్రత్యామ్నాయ తాగునీటి అవసరాల కోసం రూ.120 కోట్లు.. మిగతా జిల్లాల్లో తక్షణ అవసరాల కోసం రూ.కోటి చొప్పున ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని వెల్లడించారు. ఈ నిధులతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రంలో తాగునీటి పరిస్థితిపై మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ ఇంజినీర్లతో శనివారం మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. నీటి ఎద్దడి ఎదురయ్యే ప్రాంతాల్లో స్థానిక వనరులను వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. అవసరమైన చోట బోరు బావులను అద్దెకు తీసుకోవడంతో పాటు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. చేతిపంపులు, సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ మోటార్లను అందుబాటులో ఉంచాలని



ఆదేశించారు. భూగర్భ జలాలు అడుగంటి, మిషన్ భగీరథ నీరు అందని గ్రామాలను గుర్తించి వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

వర్షపు నీరు ఇంకేలా..

నీటి పొదుపు, ఎల్‌నినో ప్రభావంపై గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. హైదరాబాద్, మేడ్చల్, ఖమ్మం, యాదాద్రి ప్రాంతాల్లో ఇటీవల కురిసిన వర్షపు నీటిని ఒడిసిపట్టేలా చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి వనరుల వద్ద ఇంకుడు గుంతలు, మ్యాజిక్ పిట్లలో నీరు ఇంకేలా చూడాలని, నిర్మాణంలో ఉన్నవాటిని రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఎన్సీ కృపాకర్ రెడ్డి, సీఈలు, ఎస్ఈలు, ఈఈలు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్స్ తయారీలో అగ్రగామిగా తెలంగాణ!

- **తుక్కుగూడ ఈ-సిటీలో 'మివి' ఎలక్ట్రానిక్స్ ప్లాంట్ ప్రారంభం**
- **రూ.200 కోట్లతో అత్యాధునిక మాన్యుఫాక్చరింగ్ ఫెసిలిటీ ఏర్పాటు**
- **పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేస్తున్నామన్న మంత్రి శ్రీధర్ బాబు**
- **చిప్ డిజైన్, సెమీకండక్టర్ల ఉత్పత్తిపై రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక దృష్టి**

హైదరాబాద్, అక్టోబర్ 31 : తెలంగాణను దేశంలోనే ప్రముఖ ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను అవకాశాలుగా మలుచుకునేలా టెక్నాలజీ, ఇన్నోవేషన్, మాన్యుఫాక్చరింగ్ రంగాలను అనుసంధానిస్తూ కాంప్రహెన్సివ్ ఇండస్ట్రియల్ ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలోని ఈ-సిటీలో రూ.200 కోట్ల భారీ పెట్టుబడితో ఆవిష్కరణ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మివి (ఎంఐవీఐ) ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ ఫెసిలిటీని శనివారం ఆయన ప్రారంభించారు.

తయారీ రంగానికి పెద్దపీట..

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో తయారీ రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. 2025-26లో రాష్ట్ర తయారీ రంగం 7.7 శాతం వృద్ధి రేటును నమోదు చేసిందన్నారు. రాష్ట్ర పారిశ్రామిక స్థూల విలువ జోడింపులో (జీవీఏ) తయారీ రంగం వాటా రూ.1.37 లక్షల కోట్లకు చేరిందని వివరించారు. 'తెలంగాణ రైజింగ్-2047' విజన్‌లో భాగంగా ఎలక్ట్రానిక్స్ తయారీ క్లస్టర్లు, హార్డ్ వేర్ పార్కులను మరింత బలోపేతం చేసేలా ప్రత్యేక కార్యాచరణను రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. చిప్ డిజైన్, సెమీకండక్టర్ తయారీ, ఎలక్ట్రానిక్ విడిభాగాల ఉత్పత్తిలోనూ తెలంగాణను ముందంజలో నిలపాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.



నైపుణ్య శిక్షణతో యువతకు ఉపాధి..

రీసెర్చ్, ప్రొడక్ట్ డిజైన్ నుంచి విడిభాగాలు, ఎండ్ ప్రొడక్ట్స్ తయారీ వరకు అన్ని కార్యకలాపాలు రాష్ట్రంలోనే జరిగేలా కంపెనీలను ప్రోత్సహిస్తున్నామని మంత్రి తెలిపారు. స్థానిక పరిశ్రమలను గ్లోబల్ సప్లై చైన్‌తో అనుసంధానించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించామని శ్రీధర్‌బాబు వివరించారు.

మొబైల్ తయారీ రంగంలోకి 'మివి'..

హైదరాబాద్‌కు చెందిన మివి (ఎంఐవీఐ) సంస్థ గురించి మంత్రి వివరిస్తూ.. ఆ సంస్థ ఇయర్‌బడ్స్, హెడ్‌ఫోన్స్, స్పీకర్లు, సౌండ్‌బార్లు తదితర ఆడియో ఉత్పత్తులను తయారు చేస్తోందని తెలిపారు. అంతేకాకుండా తాజాగా 'మివి వన్ 5జీ' స్మార్ట్ ఫోన్‌తో మొబైల్ తయారీ రంగంలోకి కూడా అడుగు పెట్టిందని ప్రశంసించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో టీజీఐఐసీ ఎండీ శశాంక, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, మివి సంస్థ ప్రతినిధులు విశ్వనాథ్ కందుల, మిధుల దేవభక్తుని తదితరులు పాల్గొన్నారు

నగరంలో గ్రీన్ ట్యాంకర్లు

నవంబర్ 1న ప్రారంభం!

నీటి వనరులపై సీఎస్ సంజయ్ జాజు ఆదేశం

హైదరాబాద్, అక్టోబర్ 31 : నగరంలోని కోర్ అర్బన్ ప్రాంతంలో గ్రీన్ ట్యాంకర్ల కార్యక్రమాన్ని నవంబర్ 1 నుంచి ప్రారంభించనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు వాటి సుస్థిర నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కోర్ అర్బన్ ప్రాంతానికి సంబంధించి తాగునీటి సరఫరా పరిస్థితిపై శనివారం సచివాలయంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. నిర్మాణ పనులు, ల్యాండ్‌స్కేపింగ్, శుభ్రత పనులు, ఇతర తాగునీటితో సంబంధం లేని అవసరాల కోసం అన్ని ప్రభుత్వ శాఖలు తప్పనిసరిగా శుద్ధి చేసిన నీటిని మాత్రమే వినియోగించాలని సీఎస్ ఆదేశించారు. మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ) ద్వారా సరఫరా చేస్తున్న నీరు.. నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఉందో లేదో క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సూచించారు. ఎంత పరిమాణంలో రవాణా చేస్తున్నారో రోజువారీ వివరాలను సమర్పించాలని హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఎండీని ఆదేశించారు.

మొబైల్ యాప్‌తో డిమాండ్ బుకింగ్..

ఈ సందర్భంగా హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఎండీ అశోక్ రెడ్డి నీటి ఎద్దడి నివారణకు రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణను వివరించారు. మిషన్ భగీరథ కింద అదనంగా 40 ఎంజీడీల నీటిని సరఫరా చేసే పథకాన్ని నవంబర్ 15 నాటికి పూర్తి చేయనున్నట్లు తెలిపారు. జీహెచ్ఎంసీ, సైబరాబాద్ పరిధిలో విలీనమైన మున్సిపాలిటీలకు వచ్చే ఏడాది ఆగస్టు వరకు మిషన్ భగీరథ బల్క్ వాటర్ సరఫరా కొనసాగుతుందన్నారు. తాగునీటి ట్యాంకర్ల తరహాలోనే వినియోగదారులు సులభంగా పొందేందుకు ప్రత్యేక యాప్ ద్వారా ఈ గ్రీన్ ట్యాంకర్ల సదుపాయాన్ని అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. నీటి వినియోగాన్ని 20 శాతం మేర తగ్గించేలా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సమావేశంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్, మున్సిపల్ శాఖ కార్యదర్శి సర్ఫరాజ్ అహ్మద్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



యువతుల అండాలతో దందా

- ఉద్యోగాల కోసం నగరానికి వచ్చిన యువతులే లక్ష్యం
- ఒక్కో అండం విక్రయంతో ముఠాకు రూ.3 లక్షలు.. బాధితులకు రూ.30 వేలు
- ప్రకాశ్‌నగర్, సరూర్‌నగర్, గోపాల్‌పురం హాస్టళ్లపై పోలీసుల దాడులు
- దారుణాలను వెల్లడించిన మల్కాజిగిరి సీపీ సుమతి

హైదరాబాద్, అక్టోబర్ 31 : నగరంలో మహిళల ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకుని అక్రమంగా అండాలను సేకరించి విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టురట్టయింది. మల్కాజిగిరి స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్ఓటీ), బేగంపేట, సరూర్‌నగర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, బిహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశాతో పాటు తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల నుంచి ఉపాధి కోసం నగరానికి వచ్చిన అమాయక యువతులను మభ్యపెట్టి ఈ దందా సాగిస్తున్నారని మల్కాజిగిరి పోలీసు కమిషనర్ సుమతి వెల్లడించారు. ప్రకాశ్‌నగర్, సరూర్‌నగర్, గోపాల్‌పురం ప్రాంతాల్లోని మూడు వసతి గృహాల్లో (మహిళా హాస్టళ్లలో) బాధితులను ఉంచి ఈ అక్రమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఒక్కోసారి అండాల సేకరణ ద్వారా ముఠా ఏకంగా రూ.3 లక్షలు సంపాదిస్తుండగా, యువతులకు మాత్రం కేవలం రూ.30 వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. అండాల సేకరణ కోసం పదేపదే మహిళలకు హార్మోనల్ ఇంజెక్షన్లు ఇచ్చి వారి ఆరోగ్యానికి, ప్రాణాలకు తీవ్ర ముప్పు కలిగించినట్లు విచారణలో సంచలన విషయాలు వెల్లడయ్యాయి. ఈ అక్రమ దందాలో నాంపల్లికి చెందిన దుర్గాప్రసాద్, ఇండోర్‌కు చెందిన అమిత్ శర్మ కీలకంగా వ్యవహరించారు. నిక్కత్ పర్వీన్, రేష్మా అనే ఇద్దరు మహిళలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బాధితులను గుర్తించి ముఠాకు అప్పగించగా, షేక్ పర్వీన్ రవాణా బాధ్యతలు నిర్వహించినట్లు తేలింది. వీరంతా కలిసి నకిలీ పత్రాలు సృష్టించి ఫెర్టిలిటీ కేంద్రాలతో సంబంధాలు కొనసాగించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ముఠాకు చెందిన మొత్తం ఎనిమిది మంది నిందితులను అరెస్టు చేసి వారిపై మూడు కేసులు నమోదు చేశారు.



49 మందికి రక్షణ.. ఆస్పత్రులపై కఠిన చర్యలు!

బేగంపేట, సరూర్‌నగర్ ప్రాంతాల్లో పోలీసులు ఏకకాలంలో దాడులు నిర్వహించి ఏకంగా 49 మంది బాధిత మహిళలను రక్షించారు. వీరిలో బేగంపేటలో 31 మంది, సరూర్‌నగర్‌లో 18 మంది ఉన్నారు. వీరు సేకరించిన అండాలను హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఐవీఎఫ్ కేంద్రాలతో పాటు ఢిల్లీ, ముంబై నగరాల్లోని ఫెర్టిలిటీ క్లినిక్‌లకు విక్రయిస్తున్నట్లు అనుమానిస్తున్నారు. ఈ వ్యవహారంతో సంబంధమున్న ఫెర్టిలిటీ కేంద్రాల్లోనూ తనిఖీలు నిర్వహించి, నకిలీ పత్రాల తయారీ, హార్మోనల్ ఇంజెక్షన్ల వినియోగంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ సుమతి తీవ్రంగా హెచ్చరించారు.



పటేల్ ప్రధాని అయి ఉంటే.. దేశ దశ మారేది!

తొలి ప్రధాని ఎంపికలో నెహ్రూది 'ఓటు చోరీ'
కాంగ్రెస్ తీరుపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఫైర్
బీజేపీ కార్యాలయంలో ఘనంగా సర్దార్ పటేల్ జయంతి
ఆర్టికల్ 370 రద్దుతో పటేల్ కలలను సాకారం చేసిన మోదీ

హైదరాబాద్, అక్టోబర్ 31 : స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో కాంగ్రెస్ పార్టీలో మెజారిటీ సభ్యులు సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను ప్రధాని చేయాలని కోరినా.. నాటి నెహ్రూ కుటుంబం అంతర్గత ప్రజాస్వామ్యాన్ని కాలరాసి మొదటి 'ఓటు చోరీ'కి పాల్పడిందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. ఆనాడే పటేల్ ప్రధాని అయి ఉంటే దేశ ముఖచిత్రం పూర్తిగా మారిపోయేదని, ఎన్నో సంక్లిష్ట సమస్యలకు శాశ్వత పరిష్కారం దక్కేదని ఆయన అభిప్రాయపడ్డారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి (రాష్ట్రీయ ఏక్తా దివస్) వేడుకలు ఘనంగా జరిగాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావుతో కలిసి కిషన్ రెడ్డి పటేల్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. 550కి పైగా సంస్థానాలను విజయవంతంగా దేశంలో విలీనం చేసిన ఘనత ఉక్కుమనిషి పటేల్‌దే అన్నారు. నెహ్రూ చారిత్రక తప్పిదాల వల్లే కశ్మీర్‌లో సరిహద్దు ఉగ్రవాదం చెలరేగి వేలాది మంది అమాయకులు బలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ దృఢ సంకల్పంతో ఆర్టికల్ 370 రద్దు చేసి పటేల్ కలలను సాకారం చేశారని కొనియాడారు. అనంతరం నవంబర్ 2న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి ఎంజే మార్కెట్ వరకు జరగనున్న బీజేపీ మహా పాదయాత్ర ఏర్పాట్లను నేతలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై డౌటుంటే.. అసెంబ్లీని రద్దు చేయండి!

- సీఎం రేవంత్‌కు కేంద్ర మంత్రి బండి సంజయ్ సవాల్
- బ్యాలెట్ ఎన్నికలకు మేం సిద్ధమని ప్రకటన

హైదరాబాద్, అక్టోబర్ 31 : దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తున్న శక్తులతో కాంగ్రెస్ కలిసి పనిచేయడం సిగ్గుచేటని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో విమర్శించారు. విదేశీ నిధులతో పనిచేస్తున్న సంస్థలతో కలిసి ఆందోళనలు చేయడం వెనుక కాంగ్రెస్ దేశభక్తి ఏమిటని ఆయన ప్రశ్నించారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈవీఎంలపై విషప్రచారం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నేతలకు దమ్ముంటే రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేసి బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలకు రావాలని సవాల్ విసిరారు. వారు అంగీకరిస్తే బ్యాలెట్ ఎన్నికలు జరిగేలా తాను కూడా కేంద్రంతో మాట్లాడి కృషి చేస్తానన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేస్తామని, త్వరలో ఎన్ఆర్‌సీ, మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు.

దొంగ ఓట్ల తొలగింపును ఎందుకు వ్యతిరేకిస్తున్నారు?

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ ద్వారా అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు మరణించినవారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన నకిలీ ఓటర్లు, అక్రమ వలసదారుల పేర్లను తొలగిస్తారని బండి సంజయ్ వివరించారు. 1952 నుంచి 2025 వరకు 12 సార్లు ఈ ప్రక్రియ జరగ్గా, అందులో పదిసార్లు కాంగ్రెస్ పాలనలోనే జరిగిందని గుర్తుచేశారు. దేశంలో 13 కోట్ల ఓట్లు తొలగించారన్న కాంగ్రెస్ ప్రచారం అవాస్తవమని, అది ముసాయిదా జాబితా మాత్రమేనని అన్నారు. ఇందులో 2.8 కోట్ల మంది మరణించినవారు, కోటికిపైగా నకిలీ ఓటర్లు, 6.30 కోట్ల మంది నివాసాలు మారినవారు ఉన్నారని గణాంకాలు తెలిపారు. తెలంగాణలో 2004 నుంచి ఇప్పటివరకు 18.07 లక్షల మంది మరణించారని



పేర్కొన్నారు. పాతబస్తీ, మహేశ్వరం ప్రాంతాల్లో అక్రమ వలసదారుల ఓట్లు ఉన్నాయని, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరు కూడా ఓటర్ల జాబితాలో ఉండటం విడ్డూరమని వ్యాఖ్యానించారు. ఇలాంటి పేర్లను తొలగించడాన్ని కాంగ్రెస్ ఎందుకు వ్యతిరేకిస్తోందని నిలదీశారు.

బంగ్లాదేశ్ తరహా అల్లర్లకు కుట్ర..

బంగ్లాదేశ్ తరహాలో భారత్‌లో అల్లర్లు సృష్టించి మోదీ ప్రభుత్వాన్ని కూల్చాలని చూస్తున్న శక్తులతో కాంగ్రెస్ కలిసి ఆందోళనలు చేయడంపై సమాధానం చెప్పాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. 140 కోట్ల ప్రజల మద్దతున్న ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ ఏమీ చేయలేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కేవలం 365 మండలాలనే కరువు మండలాలుగా ప్రకటించడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. అనేక ప్రాంతాల్లో తాగు, సాగునీటి కొరత, విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై కాంగ్రెస్, ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు బీజేపీ రూపొందించిన 'ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం.. అరాచకాన్ని తరిమికొడదాం' అనే సమాచార బుక్‌లెట్‌ను ఈ సందర్భంగా బండి సంజయ్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు మల్క కొమరయ్య, అంజిరెడ్డి, బండారి శాంతికుమార్, డాక్టర్ ప్రకాశ్ రెడ్డి, ఎన్వీ సుభాష్, జె. సంగప్ప, సునీత తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనలో భారత్ అద్భుత ప్రగతి!

ప్రపంచ బ్యాంకు నివేదికపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హర్షం

హైదరాబాద్, అక్టోబర్ 31 : ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో పేదరిక నిర్మూలన, మౌలిక సదుపాయాల కల్పనలో దేశం అద్భుతమైన ఫలితాలను సాధిస్తోందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ బ్యాంకు తాజాగా విడుదల చేసిన 'పావర్టీ అండ్ ఈక్విటీ-2026' నివేదికలో భారత్ ప్రగతిని ప్రత్యేకంగా కొనియాడటం సంతోషకరమన్నారు. 2011-12లో 27.1 శాతంగా ఉన్న 'అత్యంత పేదరికం' 2023-24 నాటికి 2.6 శాతానికి పడిపోయిందని, ఏకంగా 49.6 కోట్ల మంది పేదరికం నుంచి బయటకు వచ్చారని నివేదిక స్పష్టం చేసిందని గుర్తుచేశారు. ఈ కాలంలో 13.4 కోట్ల ఉపాధి అవకాశాలు పెరిగాయని, ముఖ్యంగా గ్రామీణ మహిళలు పెద్ద సంఖ్యలో ఉపాధి పొందుతున్నారని ఆయన ఒక ప్రకటనలో వివరించారు. ఆదాయ అసమానతలను తగ్గించడంలో భారత్ అగ్రదేశాలను వెనక్కి నెట్టిందని కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆదాయ సమానత్వాన్ని సూచించే గినీ సూచీలో భారత్ స్కోరు 23గా నమోదైందని.. అమెరికా, చైనా, యూకే వంటి దేశాల కన్నా మన పరిస్థితి ఎంతో మెరుగ్గా ఉందని చెప్పారు. సంక్షేమ పథకాలతో దేశంలో 100% ఎల్‌పీజీ కవరేజీ, పారిశుధ్యం, విద్యుదీకరణ సాధించామని వివరించారు. దేశంలో 80 కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాలు అందిస్తున్నామన్నారు. అంతేకాకుండా, కేన్సర్ మందుల ధరలను 94 శాతం వరకు తగ్గించి సామాన్యులకు భరోసా కల్పించామని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

రేవంత్ 'క్రెడిట్ చోరీ'

వేల కోట్ల భూములను కాపాడింది మేమే..
సీఎం రేవంత్ రెడ్డి మాటలన్నీ అర్ధసత్యాలే
గ్రేహౌండ్స్ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారు
కోర్టు తీర్పుల కాపీలు బయటపెట్టిన హరీశ్ రావు



హైదరాబాద్, అక్టోబర్ 31 : గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల న్యాయస్థానాల్లో పోరాడి కాపాడిన వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను.. తానే పరిరక్షించినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'క్రెడిట్ చోరీ'కి పాల్పడుతున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ పలు కోర్టు తీర్పులు, రిజిస్ట్రేషన్ పత్రాలను బయటపెట్టారు. ప్రభుత్వ భూముల పరిరక్షణపై సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలన్నీ అర్ధసత్యాలేనని మండిపడ్డారు. మంచిరేవులలో 142 ఎకరాల గ్రేహౌండ్స్ భూములను సుప్రీంకోర్టు ద్వారా బీఆర్ఎస్సే కాపాడిందని హరీశ్ రావు గుర్తుచేశారు. కానీ, ఆ భూముల్లోని 10 ఎకరాల 10 గుంటలను కాంగ్రెస్ సర్కారు ప్రైవేట్ వ్యక్తులకు (డ్రీమ్ వ్యాలీ సంస్థలకు) అప్పగించేందుకు గ్రేహౌండ్స్ ప్రహరీని కూల్చేసిందని ఆరోపించారు. దీనివల్ల రూ.వెయ్యి కోట్ల ప్రభుత్వ ఆస్తికి నష్టం వాటిల్లిందన్నారు. మరో 10 ఎకరాల భూసేకరణను హైకోర్టు రద్దుచేయగా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఈ రెండు వ్యవహారాల్లో రూ.2 వేల కోట్ల అక్రమాలు జరిగాయని మండిపడ్డారు. మియాపూర్ ప్రభుత్వ భూముల పరిరక్షణలో బీఆర్ఎస్ ప్రభుత్వానిదే కీలకపాత్ర అని హరీశ్ రావు తెలిపారు. సుప్రీంకోర్టులో అత్యధిక విచారణలు తమ హయాంలోనే జరిగాయన్నారు. అప్పట్లో గోల్డ్‌స్టోన్ ప్రసాద్ అనుచరులను జైలుకు పంపామని, ఇప్పుడు తీర్పు రాగానే కాంగ్రెస్ ఆ భూములను విక్రయానికి పెడుతోందని విమర్శించారు. భూపాలపల్లిలోని 106 ఎకరాల అటవీ భూముల పరిరక్షణకు కూడా తామే సుదీర్ఘ పోరాటం చేశామని స్పష్టం చేశారు. ఐఎంజీ భారత్ వ్యవహారంలో కంచ గచ్చిబౌలి, మామిడిపల్లి ప్రాంతాల్లోని 850 ఎకరాల భూములను కాపాడేందుకు తొమ్మిదేళ్లు పోరాడామన్నారు. అయితే, కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాలను తాకట్టు పెట్టి రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేల కోట్ల అప్పు తెచ్చిందని, ఇందులో ముంబైకి చెందిన మధ్యవర్తికి రూ.400 కోట్ల కమిషన్ చెల్లించారని ఆరోపించారు. మంచిరేవుల రిజిస్ట్రేషన్లు, గచ్చిబౌలి భూముల తాకట్టు వ్యవహారాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

హైదరాబాద్‌లో భారీ సైబర్ మోసం!

రూ.24.76 కోట్లతో నకిలీ ట్రేడింగ్ దందా
నకిలీ వెబ్‌సైట్‌తో పెట్టుబడిదారుల మోసం
రూ.5 కోట్ల విలువైన ప్లాట్లు, విల్లా గుర్తింపు
రూ.6.40 లక్షల నగదు సీజ్.. 11 ఖాతాల ఫ్రీజ్

హైదరాబాద్, అక్టోబర్ 31 : రూ.24 కోట్లకు పైగా విలువైన సైబర్ ట్రేడింగ్ మోసం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు హైదరాబాద్‌లో సోదాలు నిర్వహించారు. నగరంలోని మూడు ప్రాంతాల్లో ప్రధాన నిందితుడు అలంరాజు సత్యనారాయణ మూర్తికి చెందిన నివాసాలు, వ్యాపార కార్యాలయాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే తక్కువ సమయంలో భారీ లాభాలు వస్తాయంటూ నకిలీ ట్రేడింగ్ వెబ్‌సైట్ ద్వారా బాధితులను మోసగించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. నిమేష్ అనే బాధితుడి నుంచి విడతల వారీగా ఏకంగా రూ.24,76,21,042 వసూలు చేసి, తిరిగి చెల్లించకుండా బోర్డు తిప్పేశాడు. అక్రమంగా సంపాదించిన సొమ్మును మ్యూల్ బ్యాంకు ఖాతాల ద్వారా దారి మళ్లించినట్లు అధికారులు గుర్తించారు. అనంతరం కుటుంబ సభ్యులు, ఉద్యోగుల పేర్లతో 'ఆశ్రిత ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్' పేరుతో విల్లా ప్రాజెక్టు చేపట్టడంతో పాటు బీటీఆర్ ఇండస్ట్రీస్, వెలుగు ట్రేడింగ్ కంపెనీ వంటి షెల్ కంపెనీలు నిర్వహించినట్లు దర్యాప్తులో తేలింది. తాజా సోదాల్లో నిందితుడి నివాసం నుంచి రూ.6.40 లక్షల నగదును ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అతడికి చెందిన 11 బ్యాంకు ఖాతాల్లోని సుమారు రూ.14 లక్షల నిల్వలను ఫ్రీజ్ చేశారు. మోసపూరితంగా సంపాదించిన సొమ్ముతో కొనుగోలు చేసినట్లు భావిస్తున్న రూ.5 కోట్ల విలువైన ప్లాట్లు, విల్లాను గుర్తించారు. కీలక పత్రాలు, డిజిటల్ ఆధారాలను సీజ్ చేసిన అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు.



మ్యూల్ ఖాతాలతో రూ.10 కోట్ల దందా!

అమాయకుల పేర్లతో బ్యాంకు ఖాతాలు తెరిపించిన ముఠా
ఒక్కో ఖాతా రూ.25 వేలకు విక్రయం.. రాజస్థాన్‌కు పార్సిల్!
నగరంలో 83 మ్యూల్ ఖాతాల గుర్తింపు
14 సైబర్ మోసాలకు 11 ఖాతాల వినియోగం
ముగ్గురిని అరెస్టు చేసిన చార్మినార్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు

హైదరాబాద్, అక్టోబర్ 31 : సైబర్ నేరగాళ్లు అక్రమ సొమ్మును దారిమళ్లించేందుకు అమాయకుల పేర్లతో నకిలీ (మ్యూల్) బ్యాంకు ఖాతాలు తెరిపిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా వ్యవహారం గుట్టురట్టయింది. చార్మినార్ జోన్ టాస్క్‌ఫోర్స్, అత్తాపూర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు.. పరారీలో ఉన్న మరో ఆరుగురి కోసం గాలిస్తున్నారు. హుస్సేనీ ఆలం షాగంజ్‌కు చెందిన సయ్యద్ అబ్బాస్, మహమ్మద్ తల్హా ఖాన్, నవాబ్ మహమ్మద్ రహీముద్దీన్ ఖాన్ స్థానికులను మభ్యపెట్టి వారి పేర్ల మీద బ్యాంకు ఖాతాలు తెరిపించేవారు. అనంతరం పాస్‌బుక్స్, ఏటీఎం కార్డులు, పిన్ నంబర్లు, సిమ్ కార్డులతో కూడిన కిట్లను రాజస్థాన్‌లోని జైపూర్‌కు కొరియర్ చేసేవారు. ఇలా ఒక్కో ఖాతాను రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు విక్రయించేవారు. జైపూర్‌కు చెందిన బాబూలాల్, విజయ్‌లతో వీరు ఈ సైబర్ దందా సాగించినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి సీజ్ చేసిన మొబైల్ ఫోన్లు, పాస్‌బుక్‌లను పరిశీలించగా వివిధ బ్యాంకుల్లో ఏకంగా 83 మ్యూల్ ఖాతాలు తెరిచినట్లు వెల్లడైంది. వీటిలో 11 ఖాతాలను ఉపయోగించి దేశవ్యాప్తంగా 14 సైబర్ మోసాలకు పాల్పడినట్లు జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా ఆధారాలు సేకరించారు. ఈ మ్యూల్ ఖాతాల ద్వారా ఇప్పటివరకు మొత్తం రూ.10,04,84,094 సైబర్ నేరాదేవీలు జరిగినట్లు దర్యాప్తులో తేలింది. నిందితులపై అత్తాపూర్, కల్వకుర్తి పోలీస్ స్టేషన్లలో ఐటీ చట్టం కింద కేసులు నమోదు చేశారు. పరారీలో ఉన్న బాబూలాల్, విజయ్, సల్మాన్ తదితరుల కోసం గాలిస్తున్నారు. కాగా, సొంత బ్యాంకు ఖాతాలు, ఏటీఎం కార్డులు, సిమ్ కార్డులను ఇతరులకు విక్రయించినా, అద్దెకు ఇచ్చినా క్రిమినల్ చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఆన్‌లైన్ సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు గానీ, లేదా వెబ్‌సైట్‌లో గానీ ఫిర్యాదు చేయాలని సూచించారు.

సంపాదకీయం



యుద్ధానికి ఖర్చులేదట

చమురుతో లెక్క సరిపోయిందట!

వెనెజువెలా చమురుతో ఇరాన్ యుద్ధ వ్యయం భర్తీ చేశామన్న ట్రంప్

ప్రాణనష్టానికి వెల కట్టేదెవరు?.. విధ్వంసానికి బాధ్యత ఎవరిది?

యుద్ధాన్ని లాభనష్టాల వ్యాపారంగా మారుస్తున్న అగ్రరాజ్యాల ధోరణి

యుద్ధం అంటే రెండు దేశాల మధ్య సైనిక పోరాటమా? ఆధిపత్యం కోసం సాగించే విధ్వంసమా? లేక లాభనష్టాలను బేరీజు వేసుకునే వ్యాపారమా? అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన తాజా వ్యాఖ్యలు ఈ ప్రశ్నలను మరోసారి ప్రపంచం ముందుకు తీసుకొచ్చాయి. ఇరాన్‌తో యుద్ధానికి పెద్దగా ఖర్చు కాలేదని, వెనెజువెలా నుంచి తరలించిన ముడిచమురు ఆదాయంతో ఆ వ్యయాన్ని భర్తీ చేసుకున్నామని ఆయన ప్రకటించడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. అయితే యుద్ధంలో కోల్పోయిన ప్రాణాలు, ధ్వంసమైన నగరాలు, ఛిన్నాభిన్నమైన కుటుంబాల భవిష్యత్తుకు ఏ చమురు సంపదతో వెల కట్టగలరన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇరాన్‌తో యుద్ధం కోసం అమెరికా ఇప్పటివరకు సుమారు 4,700 కోట్ల డాలర్లు ఖర్చు చేసినట్లు అంచనాలు వెలువడుతున్నాయి. అయితే వెనెజువెలా చమురు ద్వారా వచ్చిన ఆదాయంతో ఈ మొత్తాన్ని భర్తీ చేసుకున్నామని ట్రంప్ పేర్కొన్నారు. ఎంత చమురు తరలించారు? ఎంత ఆదాయం సమకూరింది? ఆ నిధులు యుద్ధ వ్యయానికి ఎలా వినియోగించారు? అనే అంశాలపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. యుద్ధ వ్యయాన్ని కేవలం ఆయుధాలు, క్షిపణులు, యుద్ధ విమానాల ఖర్చుతోనే లెక్కించలేం. ధ్వంసమైన మౌలిక సదుపాయాలు, దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థ, ఉపాధి కోల్పోయిన ప్రజలు, నిర్వాసితులైన కుటుంబాల నష్టాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. డాలర్లతో ఆయుధాలు కొనవచ్చేమో గానీ, యుద్ధంలో కోల్పోయిన ప్రాణాలను తిరిగి తీసుకురాలేం. పశ్చిమాసియా రాజకీయాల్లో చమురు దశాబ్దాలుగా కీలక పాత్ర పోషిస్తోంది. ఇంధన వనరులపై ఆధిపత్యం, సముద్ర రవాణా మార్గాల నియంత్రణ, ఆర్థిక ఆంక్షలు అగ్రరాజ్యాల విదేశాంగ విధానాలను ప్రభావితం చేస్తున్నాయి. వెనెజువెలా చమురు ఆదాయాన్ని ఇరాన్ యుద్ధంతో ముడిపెట్టి ట్రంప్ మాట్లాడటం ఈ నేపథ్యంలో ప్రాధాన్యం సంతరించుకుంది. సహజ వనరులు ఆయా దేశాల ప్రజల సంక్షేమానికి ఉపయోగపడాలి. కానీ వాటిని రాజకీయ ఆధిపత్యానికి, సైనిక ప్రయోజనాలకు సాధనంగా మార్చడం అంతర్జాతీయ సంబంధాల్లో కొత్త సంక్షోభాలకు దారితీసే ప్రమాదముంది.

యుద్ధం కొనసాగిస్తూనే శాంతి చర్చలా?

ఇరాన్‌తో యుద్ధాన్ని ముగించేందుకు తొందర లేదని ట్రంప్ వ్యాఖ్యానించడం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు అమెరికాతో చర్చలకు ఇరాన్ ఆసక్తి చూపుతోందని ఆయన పేర్కొన్నారు. ఆ దేశంలో ఆర్థిక పరిస్థితి దిగజారిందని, సైనికులు, పోలీసులకు జీతాలు కూడా చెల్లించలేని స్థితి ఏర్పడిందని ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలకు స్వతంత్ర ధ్రువీకరణ అందుబాటులో లేదు. ఇదే సమయంలో అమెరికా, ఇరాన్ మధ్య తాత్కాలిక ఒప్పందానికి సంబంధించిన ముసాయిదా రూపొందినట్లు సమాచారం. ఇరాన్ వద్ద ఉన్న యురేనియం నిల్వలను మూడో దేశానికి తరలించడం లేదా వాటి శుద్ధి స్థాయిని తగ్గించడం వంటి ప్రతిపాదనలు అందులో ఉన్నట్లు తెలుస్తోంది. అణు కార్యక్రమాలపై అంతర్జాతీయ పర్యవేక్షణ, పరస్పర విశ్వాసం లేకుండా శాశ్వత శాంతి సాధించడం కష్టమే.

హర్ముజ్ జలసంధిపై ప్రపంచం ఆందోళన

ప్రతిపాదిత ఒప్పందం ప్రకారం ఏడు రోజుల్లో హర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరవాలనే అంశం ఉన్నట్లు సమాచారం. ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన ఈ మార్గంలో అంతరాయాలు ఏర్పడితే అంతర్జాతీయ ఇంధన ధరలు పెరిగే ప్రమాదముంది. ముఖ్యంగా భారత్ వంటి చమురు దిగుమతులపై ఆ ప్రభావం అధికంగా ఉంటుంది. అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు ఖతార్‌లో జరిగే అవకాశముందని, ఒప్పందం అమలుకు చైనా హామీదారుగా వ్యవహరించవచ్చని ప్రచారం జరుగుతోంది. అయితే ఈ అంశాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

యుద్ధం లాభసాటి వ్యాపారం కాదు!

యుద్ధాన్ని గెలుపోటములు, ఆర్థిక లాభనష్టాల కోణంలో చూడటం అగ్రరాజ్యాల నాయకులకు సులభమే. కానీ యుద్ధం మిగిల్చే గాయాలు తరతరాలపాటు వెంటాడుతాయి. ఒక దేశాన్ని సైనికంగా బలహీనపరచవచ్చేమో గానీ, శాశ్వత శాంతిని ఆయుధాలతో సాధించలేం. అందుకు దౌత్యం, పరస్పర గౌరవం, అంతర్జాతీయ ఒప్పందాల అమలు అవసరం. ప్రపంచం ఎదురుచూస్తున్నది యుద్ధానికి ఎంత ఖర్చయింది? ఆ ఖర్చును ఎలా రాబట్టారు? అనే లెక్కల కోసం కాదు. దాడులు ఎప్పుడు ఆగుతాయి? అణు ముప్పు ఎప్పుడు తొలగుతుంది? ప్రజలకు భద్రత ఎప్పుడు లభిస్తుంది? అన్న ప్రశ్నలకు సమాధానాల కోసం. యుద్ధానికి ఖర్చయిన డాలర్లను చమురు ఆదాయంతో భర్తీ చేయగలమని చెప్పవచ్చు. కానీ యుద్ధంలో కోల్పోయిన ప్రాణాలను, కన్నీళ్లను, ధ్వంసమైన భవిష్యత్తును ఏ సంపదతోనూ భర్తీ చేయలేం. యుద్ధంలో ఎంత సంపాదించామన్నది గొప్పతనం కాదు.. యుద్ధాన్ని ఆపి ఎన్ని ప్రాణాలను కాపాడామన్నదే నిజమైన నాయకత్వానికి కొలమానం!

జ్ఞానేశ్‌పై 'ప్రజా అభిశంసన'

- ప్రతిపక్షాల ప్రత్యామ్నాయ పార్లమెంట్!
- ఢిల్లీలో ఇండియా కూటమి వినూత్న నిరసన కార్యక్రమం
- ఖర్గే నివాసంలో మాక్ పార్లమెంట్
- సభాపతిగా మాజీ లోక్‌సభ స్పీకర్ మీరా
- జ్ఞానేశ్ కుమార్‌పై తీర్మానం ప్రవేశపెట్టిన మల్లికార్జున ఖర్గే
- సోనియా, రాహుల్ సహా ప్రతిపక్ష అగ్రనేతల హాజరు
- ఓటర్ల జాబితా సవరణపై తీవ్ర ఆరోపణలు.. బీజేపీ ఎదురుదాడి





న్యూఢిల్లీ, అక్టోబర్ 31 : కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహారశైలిని నిరసిస్తూ ప్రతిపక్ష ఇండియా కూటమి దేశ రాజధానిలో వినూత్న నిరసన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న కూటమి నేతలు శనివారం ఢిల్లీలో ప్రత్యామ్నాయ పార్లమెంట్ కార్యక్రమాన్ని చేపట్టారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధికారిక నివాసంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జ్ఞానేశ్ కుమార్‌పై ప్రజా అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. మాజీ లోక్‌సభ స్పీకర్ మీరా కుమార్ సభాపతి పాత్ర పోషించగా, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతోపాటు ఇండియా కూటమికి చెందిన పలువురు నాయకులు, ముఖ్యమంత్రులు పాల్గొన్నట్లు సమాచారం. ప్రతిపక్షాలు ఏర్పాటు చేసిన మాక్ పార్లమెంట్‌లో మాజీ లోక్‌సభ స్పీకర్ మీరా కుమార్ సభాపతి బాధ్యతలు నిర్వహించారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై ప్రజా అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఎన్నికల సంఘం పనితీరు, ఓటర్ల జాబితాల సవరణ, ఓటు హక్కు పరిరక్షణ వంటి అంశాలపై చర్చ చేపట్టారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చర్చ ముగింపులో ప్రసంగించనున్నట్లు కూటమి వర్గాలు తెలిపాయి. దేశవ్యాప్తంగా చేపడుతున్న ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై ఇండియా కూటమి నేతలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఈ ప్రక్రియలో అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదని ఆరోపిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై ఎన్నికల సంఘం అధికారిక వివరణను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది. ఓటు హక్కును పరిరక్షించడం, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసాన్ని నిలబెట్టడం తమ లక్ష్యమని ప్రతిపక్ష నేతలు పేర్కొంటున్నారు. ఎన్నికల సంఘం నిర్ణయాలపై పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని కోరుతున్నారు. ఈ అంశాలపై ప్రజల దృష్టిని ఆకర్షించేందుకే ప్రత్యామ్నాయ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కూటమి వర్గాలు చెబుతున్నాయి. ప్రతిపక్షాల మాక్ పార్లమెంట్ కార్యక్రమంపై బీజేపీ విమర్శలు గుప్పించింది. రాహుల్ గాంధీ వాస్తవ రాజకీయాల్లో విజయం సాధించలేక తనకు నచ్చిన పార్లమెంట్‌ను తానే ఏర్పాటు చేసుకున్నారని ఎద్దేవా చేసింది. ప్రతిపక్షాల కార్యక్రమాన్ని రాజకీయ ప్రచార ప్రయత్నంగా అభివర్ణించింది. దీంతో ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం మరింత ముదిరింది. ప్రతిపక్షాలు నిర్వహిస్తున్న మాక్ పార్లమెంట్ ఒక ప్రతీకాత్మక రాజకీయ నిరసన కార్యక్రమం మాత్రమే. ఇందులో ప్రవేశపెట్టిన ప్రజా అభిశంసన తీర్మానానికి పార్లమెంట్‌లో అధికారికంగా చేపట్టే తొలగింపు ప్రక్రియతో సంబంధం లేదు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను పదవి నుంచి తొలగించాలంటే రాజ్యాంగంలోని 324(5) అధికరణం ప్రకారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి తొలగింపునకు వర్తించే విధానాన్ని అనుసరించాల్సి ఉంటుంది.



నింగిలో మరో విజయం.. ఇస్రోకు మోదీ ప్రశంసలు!

జీఎస్ఎల్వీ-ఎఫ్18 ప్రయోగం విజయవంతం

నిర్దేశిత కక్ష్యలోకి ఎన్వీఎస్-03 నావిగేషన్ ఉపగ్రహం

శాస్త్రవేత్తలు, ఇంజినీర్లకు ప్రధాని అభినందనలు

మరింత బలోపేతం కానున్న స్వదేశీ 'నావిక్' వ్యవస్థ

సాంకేతిక స్వావలంబన దిశగా మరో ముందడుగన్న మోదీ

శ్రీహరికోట, అక్టోబర్ 31 : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో కీలక ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగించిన జీఎస్ఎల్వీ-ఎఫ్18 రాకెట్ ఎన్వీఎస్--03 నావిగేషన్ ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టినట్లు తెలిపింది. ఈ విజయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజినీర్లకు అభినందనలు తెలియజేశారు. భారత అంతరిక్ష శాస్త్రవేత్తల పట్టుదల, అంకితభావం దేశానికి గర్వకారణమని కొనియాడారు. స్వదేశీ ఉపగ్రహ ఆధారిత దిశానిర్దేశ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ఈ ప్రయోగం కీలక ముందడుగని పేర్కొన్నారు. శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం రెండో ప్రయోగ వేదిక నుంచి శుక్రవారం రాత్రి 11.51 గంటలకు జీఎస్ఎల్వీ--ఎఫ్18 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లినట్లు ప్రయోగ వివరాలు వెల్లడిస్తున్నాయి. మూడు దశలతో రూపొందించిన ఈ రాకెట్ ఎత్తు 50 మీటర్లు కాగా, ప్రయోగ సమయంలో మొత్తం బరువు సుమారు 420 టన్నులు. వివిధ దశలను విజయవంతంగా అధిగమించిన అనంతరం 2,232 కిలోల బరువున్న ఎన్వీఎస్--03 ఉపగ్రహాన్ని భూసమకాలిక బదిలీ కక్ష్యలోకి ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. భారత్ స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన ప్రాంతీయ ఉపగ్రహ దిశానిర్దేశ వ్యవస్థ 'నావిక్' సామర్థ్యాన్ని పెంపొందించడంలో ఎన్వీఎస్-03 కీలక పాత్ర పోషించనుంది. దేశవ్యాప్తంగా దిశానిర్దేశ సేవలను మరింత సమర్థంగా అందించేందుకు ఈ ఉపగ్రహం ఉపయోగపడనుంది. ముఖ్యంగా రవాణా, సముద్రయానం, అత్యవసర సేవలు, భౌగోళిక స్థాన నిర్ధారణ వంటి రంగాల్లో ఉపగ్రహ ఆధారిత సేవలను మెరుగుపరిచే అవకాశముంది. ఎన్వీఎస్-03 ఉపగ్రహంలో స్వదేశీ, విదేశీ అణు గడియారాలను అమర్చినట్లు ప్రయోగ వివరాల్లో పేర్కొన్నారు. ఉపగ్రహ ఆధారిత దిశానిర్దేశ వ్యవస్థల్లో సమయాన్ని అత్యంత కచ్చితంగా లెక్కించడం కీలకం. ఈ గడియారాల సహాయంతో స్థాన నిర్ధారణ, సమయ సమాచార సేవల కచ్చితత్వాన్ని మెరుగుపరచవచ్చు. తద్వారా నావిక్ వ్యవస్థ పనితీరు మరింత సమర్థంగా మారనుంది. ఈ ప్రయోగ విజయాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ ఇస్రో బృందాన్ని అభినందించారు. భారత అంతరిక్ష పరిశోధన రంగంలో శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు కనబరుస్తున్న నిబద్ధత ప్రశంసనీయమని పేర్కొన్నారు. స్వదేశీ నావిగేషన్ వ్యవస్థ బలోపేతం కావడం ద్వారా ప్రజలకు ఉపయోగపడే సేవలు మరింత విస్తరిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అత్యాధునిక సాంకేతికతలో స్వయం సమృద్ధి సాధించాలన్న భారత లక్ష్యానికి ఇటువంటి ప్రయోగాలు మరింత బలాన్నిస్తాయని తెలిపారు. ఉపగ్రహ ఆధారిత దిశానిర్దేశ సేవల కోసం విదేశీ వ్యవస్థలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడంలో నావిక్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. దేశీయ అవసరాలకు అనుగుణంగా సొంత వ్యవస్థను అభివృద్ధి చేసుకోవడం వ్యూహాత్మకంగానూ కీలకమే. ఈ నేపథ్యంలో ఎన్వీఎస్-03 వంటి ఉపగ్రహాలు భారత అంతరిక్ష సాంకేతిక సామర్థ్యాన్ని మరింత విస్తరించనున్నాయి. అంతరిక్షంలో భారత్ సాధిస్తున్న విజయాల పరంపరలో మరో కీలక ఘట్టంగా ఈ ప్రయోగాన్ని పేర్కొంటున్నారు. స్వదేశీ సాంకేతికతతో ప్రపంచానికి తన సామర్థ్యాన్ని చాటుతున్న ఇస్రో శాస్త్రవేత్తలకు ప్రధాని మోదీ అభినందనలు తెలియజేయడం విశేషంగా నిలిచింది.

పోలీస్ కార్యాలయంలోనే బాలికపై లైంగికదాడి

సహాయం కోరిన బాలికపై పోలీస్ అధికారి అఘాయిత్యం

అరాచకానికి మహిళా ఉద్యోగిని సహకారం దారుణం



పనాజీ, అక్టోబర్ 31 : రక్షణ కల్పించాల్సిన రక్షక భటుడే భక్షకుడిగా మారి దారుణానికి ఒడిగట్టిన ఘటన ఉత్తర గోవాలో తీవ్ర సంచలనం సృష్టించింది. న్యాయం కోసం సహాయాన్ని కోరి వచ్చిన ఒక 16 ఏళ్ల మైనర్ బాలికపై క్రైమ్ బ్రాంచ్ కార్యాలయంలోనే పోలీస్ అధికారి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ అరాచకానికి ఆ అధికారి వద్ద పనిచేసే సహచర మహిళా ఉద్యోగిని కూడా సంపూర్ణంగా సహకరించడం గమనార్హం. బాధిత బాలిక ధైర్యంగా ముందుకు వచ్చి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నిందితులైన వారిద్దరిపై పలు కఠిన చట్టపరమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. పూర్తి వివరాల్లోకి వెళితే.. 16 ఏళ్ల బాధిత బాలిక తనకున్న సమస్యపై సహాయం కోసం తొలుత స్థానిక బాలల సహాయ కేంద్రాన్ని సంప్రదించింది. ఈ క్రమంలో ఆమె ఫిర్యాదును తగిన పరిశీలన, విచారణ కోసం రిబాందర్‌లోని క్రైమ్ బ్రాంచ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ వికాస్ దేకర్‌కు అధికారులు పంపారు. అయితే విచారణ సాకుతో జూలై 25, అక్టోబర్ 27 తేదీలలో క్రైమ్ బ్రాంచ్ కార్యాలయంలోనే పోలీస్ ఇన్‌స్పెక్టర్ వికాస్ దేకర్ ఆ బాలికపై దారుణంగా అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ క్రూరత్వానికి ఆ పోలీస్ అధికారి సహచరురాలైన మహిళా సిబ్బంది రంజినీ పల్యేకర్ కూడా ప్రత్యక్షంగా సహకరించినట్లు బాధిత బాలిక తన ఫిర్యాదులో ఆరోపించింది. దీంతో నిందితులు వికాస్ దేకర్, రంజినీ పల్యేకర్‌లపై పోక్సో చట్టంతో పాటు ఇతర తీవ్రమైన సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ దారుణ ఘటనపై స్పందించిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) అలోక్ కుమార్.. పోలీస్ శాఖలో ఇలాంటి దుష్ప్రవర్తనల పట్ల ఏమాత్రం సహించేది లేదని, జీరో టాలరెన్స్ విధానాన్ని కచ్చితంగా అనుసరిస్తున్నట్లు స్పష్టం చేశారు. నిందితుడైన ఇన్ స్పెక్టర్ వికాస్ దేకర్‌తో పాటు ఆయన సహచరురాలిపై తక్షణమే చట్టపరమైన, తీవ్రమైన శాఖాపరమైన చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. బాధితురాలికి న్యాయం జరిగేలా ఈ కేసును పారదర్శక విచారణ కోసం ఓల్డ్ గోవా పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసి ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన మీడియాకు తెలియజేశారు.

ఐఏఎఫ్ చీఫ్‌గా ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ బాధ్యతల స్వీకారం



న్యూఢిల్లీ, అక్టోబర్ 31 : భారత వైమానిక దళ చీఫ్‌గా ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ బాధ్యతలు స్వీకరించారు. ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ శనివారం పదవీ విరమణ చేయగా, దీక్షిత్ బాధ్యతలు చేపట్టారు. దాదాపు 20 రకాల యుద్ధ విమానాలను నడిపిన అనుభవం ఉన్న అశుతోష్ దీక్షిత్.. 2028 డిసెంబర్ 31 వరకు ఈ బాధ్యతల్లో కొనసాగనున్నారు. వ్యూహాత్మక ప్రణాళికల్లో పేరొందిన ఆయన ఆపరేషన్ సిందూర్ సమయంలో కీలకపాత్ర పోషించారు. ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ 1966 డిసెంబర్ 9న జన్మించారు. 1986 డిసెంబర్ 6న వాయుసేనలో చేరారు. నాలుగు దశాబ్దాల కాలంలో వివిధ హోదాల్లో పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. మిరాజ్-2000, కిరణ్, మిగ్, జాగ్వార్, తేజస్ వంటి యుద్ధ విమానాల్లో 3,500 గంటలకు పైగా విమానయానం చేసిన అనుభవం ఉంది. ఆపరేషన్ సఫేద్ సాగర్, ఆపరేషన్ రక్షక్, ఆపరేషన్ సిందూర్ వంటి అనేక కీలక ఆపరేషన్‌లలో పనిచేశారు.

ప్రజాప్రతినిధులకు పరికిపండ్ల నరహరి దిశానిర్దేశం



శెనార్తి మీడియా, శంకరపట్నం:

కరీంనగర్ జిల్లా ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఆకుబత్తిని విజయ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బొట్ల కార్తీక్‌తో కలిసి సీనియర్ ఐఏఎస్ అధికారి, పార్లమెంట్ సెక్రటరీ పరికిపండ్ల నరహరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు రాజకీయ రంగంలో ఎదిగేందుకు అనుసరించాల్సిన విధానాలు, ప్రజలతో మమేకమై పనిచేసే తీరు, గ్రామస్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాల్సిన బాధ్యతలపై నరహరి పలు సూచనలు చేశారు. నిజాయితీ, నిబద్ధత, సేవాభావంతో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటేనే వారి విశ్వాసాన్ని పొందగలరని వివరించారు. ఈ సమావేశంలో ఫోరం రాష్ట్ర అధికార ప్రతినిధి దుస్సా కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజి రెడ్డి, పలువురు ఉపసర్పంచ్‌లు పాల్గొన్నారు. ప్రజాసేవ, నాయకత్వ లక్షణాలు, గ్రామీణ అభివృద్ధిపై విలువైన సూచనలు అందాయని ఫోరం ప్రతినిధులు తెలిపారు.

కన్నాపూర్ లో కమ్యూనిటీ సీసీ కెమెరాల ప్రారంభం



- **సొంత నిధులతో రూ.42 వేల ఖర్చు చేసిన సర్పంచ్**

శెనార్తి మీడియా, శంకరపట్నం:

గ్రామంలో నిఘా వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు కన్నాపూర్ సర్పంచ్ నూనె రమా శ్రీనివాస్ ముందుకొచ్చారు. తన సొంత నిధులు రూ.42 వేలతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను హుజూరాబాద్ ఏసీపీ మాధవి ప్రారంభించారు. అనంతరం ఏసీబీ మాధవి మాట్లాడుతూ సీసీ కెమెరాలు గ్రామాల భద్రతలో కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. అనుమానస్పద వ్యక్తుల కాదలికలను గుర్తించడానికి దొంగతనాలు అసాంఘిక కార్యకలాపాలు ఇతర నేలలను అరికట్టడానికి సీసీ కెమెరాలు కొత్తగా ఎంతో ఉపయోగపడతాయని ఆమె అన్నారు.ప్రతి గ్రామంలో ప్రజలు గ్రామ సర్పంచులు ప్రజాప్రతినిధులు గ్రామ పెద్దలు సమన్వయంతో ముందుకు వచ్చు కమ్యూనిటీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు పోలీసులకు ప్రజలందరూ సహకరించాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ రూరల్ సీఐ శ్రీనివాస్, కేశవపట్నం ఎస్ఐ శేఖర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది,నూనె శ్రీనివాస్ , ఉప సర్పంచ్ నూనె అశోక్ మాజీ సింగిల్ విండో డైరెక్టర్ కాల్వ వెంకట రమణారెడ్డి, జాలి రమణారెడ్డి,వార్డు సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


ఎస్జీఎఫ్ క్రీడా పోటీల్లో తేజస్ విద్యార్థుల ప్రతిభ

శెనార్తిమీడియా, కొత్తపల్లి :



ఎస్జీఎఫ్ అండర్ 19 క్రీడా పోటీల్లో కొత్తపల్లి పట్టణంలోని తేజస్ జూనియర్ , డిఫెన్స్ కాలేజ్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు కాలేజ్ చైర్మన్ సీహెచ్.సతీష్‌రావు తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో నిర్వహించిన ఎస్జీఎఫ్ అండర్-19 జూనియర్ కళాశాలల క్రీడా పోటీలను ఎల్ఎండీ ప్రాంతీయ క్రీడా పాఠశాలలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో సీహెచ్ .భీమేష్ జావెలిన్ త్రోలో ప్రథమ స్థానం, హైజంప్‌లో ద్వితీయ స్థానం, జె. సాయికృష్ణ డిస్కస్ త్రోలో ద్వితీయ స్థానం, బి.నాగరాజు షాట్ పుట్‌లో ద్వితీయ స్థానం సాధించినట్లు పేర్కొన్నారు. అథ్లెటిక్స్ పోటీల్లో అద్భుత విజయం సాధించిన విద్యార్థులను చైర్మన్ సతీష్‌రావు, డైరెక్టర్ సీహెచ్. మౌనికా రావు, ప్రిన్సిపాల్ కిషన్ రెడ్డి, పీఈటీలు అభినందించారు. విద్యార్థులు క్రీడల్లో మరింత కృషి చేసి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి తేజస్ కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. క్రమశిక్షణతో కూడిన కృషి విజయానికి బాట వేస్తుందని చెప్పారు.

తక్కువ నీటితో పండే పంటలను సాగుచేయండి



- **కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాస్ రెడ్డి**


శెనార్తిమీడియా, రామడుగు :

ఎల్నినో నేపథ్యంలో రైతులు తక్కువ నీటితో పండే పంటలను సాగుచేయాలని కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాస్ రెడ్డి సూచించారు. రామడుగు మండలం వెలిచాల గ్రామ పంచాయతీలో వ్యవసాయ శాఖ, కేవీకే ఆధ్వర్యంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం ద్వారా నేల ఆరోగ్య పరిరక్షణపై శనివారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయంలో నేల ఆరోగ్య పరిరక్షణ ఎంతో ముఖ్యమని, భూసారం తగ్గకుండా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన నేలను అందించాల్సిన బాధ్యత ప్రతి రైతుపై ఉందన్నారు. రసాయనిక ఎరువుల వినియోగాన్ని నేల పరీక్షల ఆధారంగా సమతుల్యంగా చేపట్టాలని, సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు, జీవ ఎరువుల వినియోగాన్ని పెంచాలని సూచించారు. పంటల మార్పిడి విధానాన్ని అనుసరించడం ద్వారా నేలలో పోషక సమతుల్యతను కాపాడుకోవచ్చని వివరించారు. ఎల్నినో ప్రభావం దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని సూచించారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో తక్కువ నీటితో పండించే ప్రత్యామ్నాయ పంటలైన మొక్కజొన్న, పెసర, మినుము, వేరుశెనగ, సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు పంటల ఎంపిక, విత్తనాల ఎంపిక చేపట్టాలని కోరారు. వ్యవసాయంలో దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నేల ఆరోగ్య పరిరక్షణ, నీటి పొదుపు, పంటల వైవిధ్యీకరణ, సేంద్రియ వ్యవసాయం వంటి పద్ధతులను రైతులు ఆచరణలో పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎం.ప్రభావతి, ఏఈవో శిరీష, సర్పంచ్ వీర్ల నర్సింగారావు, ఉప సర్పంచ్ ఎల్లమ్మల వసంత, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, గ్రానైట్ లారీ ఢీకొని ఐదుగురికి గాయాలు

- **ప్రమాదంపై ఆరా తీసిన మంత్రి పొన్నం ప్రభాకర్**
- **క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించండి**
- **జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశం**





శెనార్తిమీడియా, కరీంనగర్ :

కొత్తపల్లి మండలం బావుపేట వద్ద గ్రానైట్ బండరాయి కోసం వెళ్తున్న కంటైనర్ ను కరీంనగర్ వన్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో బస్సు డ్రైవర్, ఐదుగురు ప్రయాణికులు గాయాలపాలయ్యారు. వారిని 108లో కరీంనగర్ సివిల్ హాస్పిటల్ కు తరలించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా వైద్యాధికారులను ఆదేశించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందిస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఆర్డీవో షర్మిల ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారని, గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కాగా సిరిసిల్లకు వెళ్తున్న ఈ బస్సులో 24 మంది ప్రయాణికులు ఉన్నారు. బావుపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరా తీశారు. ప్రమాదంపై జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, ఆర్టీసీ ఎండీ, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్య చికిత్స అందించాలని అధికారులకు సూచించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు.

కేశవపట్నంలో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్

- **72 వాహనాలు స్వాధీనం..**
- **40 మంది పోలీసులతో విస్తృత తనిఖీలు**



శెనార్తి మీడియా, శంకరపట్నం:

శంకరపట్నం మండలంలోని కేశవపట్నం, హుజూరాబాద్ సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో 40 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు రెండు ప్రత్యేక స్ట్రైకింగ్ బృందాలు పాల్గొన్నాయి. గ్రామాల్లోని ఇళ్లు, పరిసర ప్రాంతాలను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానితుల కదలికలు, అసాంఘిక కార్యకలాపాలపై ఆరా తీశారు.సరైన ధ్రువపత్రాలు లేని 72 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో 65 ద్విచక్ర వాహనాలు, నాలుగు త్రిచక్ర వాహనాలు, మూడు నాలుగు చక్రాల వాహనాలు ఉన్నాయి. ఈ సందర్భంగా హుజూరాబాద్ ఏసీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించడం, అక్రమ కార్యకలాపాలను అరికట్టడం, నేరాలను నియంత్రించడమే తనిఖీల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలతో ప్రజల్లో భద్రతపై నమ్మకం పెరుగుతుందని, నేరాలకు పాల్పడే వారిలో పోలీసుల పట్ల భయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గంజాయి సహా ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. రహదారి భద్రతా నియమాలు పాటిస్తూ కొత్తగా నిర్మించిన బైపాస్ రహదారిపై నిర్దేశించిన మార్గాల్లోనే ప్రయాణించాలని కోరారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, అసాంఘిక కార్యకలాపాలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఆపరేషన్‌లో హుజూరాబాద్ టౌన్ సీఐ టీ. కరుణాకర్, జమ్మికుంట టౌన్ సీఐ ఎస్. రామకృష్ణ, హుజూరాబాద్ రూరల్ సీఐ వి. శ్రీనివాస్, ఇల్లంతకుంట ఎస్సై ఎం. క్రాంతి కుమార్, సైదాపూర్ ఎస్సై కే. స్వాతి, హుజూరాబాద్ టౌన్ ఎస్సై వి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భూభారతి రీసర్వేపై గ్రామసభలతో అవగాహన



శెనార్తి మీడియా, శంకరపట్నం:

మండలంలోని కల్వల, అరకండ్ల గ్రామాల్లో శనివారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో భూభారతి రీసర్వేపై గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, గ్రామస్థులకు సర్వే విధానంపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ కే. సురేఖ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి రీసర్వేలో రైతులు, గ్రామస్థులు భాగస్వాములై సర్వేయర్లకు సహకరించాలని కోరారు. భూములకు సంబంధించిన రికార్డులు, యాజమాన్య హక్కులను పరిశీలించుకోవాలని, సర్వేపై ఎలాంటి ఆందోళన చెందవద్దని సూచించారు. ఏడీఏ కిషన్‌రావు మాట్లాడుతూ పట్టాదారులు తమ భూముల హద్దులను గుర్తించి, సమస్యలుంటే సర్వేయర్లకు తెలియజేయాలని అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే చేపట్టి భవిష్యత్తులో భూ వివాదాలకు తావులేకుండా పట్టాదారు పాస్ పుస్తకాలు, మ్యాపులు అందజేస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో అరకండ్ల సర్పంచ్ పవన్, కల్వల సర్పంచ్ అంజలి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, సర్వేయర్ మనోజ్, ఆర్ఐ రాములు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు

నల్ల బ్యాడ్జీలతో మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల నిరసన



శెనార్తి మీడియా, శంకరపట్నం:

మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శంకరపట్నం తెలంగాణ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు శనివారం నిరసన చేపట్టారు. మోడల్ స్కూల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (MS JAC) పిలుపు మేరకు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఉపాధ్యాయులంతా ఐక్యంగా ఉద్యమిస్తేనే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఇతరుల కోసం ఎదురుచూడకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పాఠశాల స్థాయి నుంచి మండల, జిల్లా స్థాయిల వరకు ఆందోళనలను విస్తరించి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.ప్రభాకర్, TG TEAM రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ మహేందర్ కట్కూరి, బొల్లం రాజు, సతీష్ కుమార్, శివశంకర్, మధుకర్, శంకర్, నరేష్, వాసుదేవ్, నాగమణి, ఆర్. రజిత, ఫర్హీన, ఎస్. రజిత, వనజ, రాధాదేవి, సంధ్య, అనిత, స్వప్న, ప్రవంతితో పాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కంప్యూటర్ రాజు, సుజాత పాల్గొన్నారు

కార్మికుల హక్కుల కోసం నిరంతర పోరాటం



శెనార్తి మీడియా, శంకరపట్నం: ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవాన్ని శంకరపట్నం మండలంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఏఐటీయూసీ కార్యాలయం వద్ద జిల్లా కార్యదర్శి పిట్టల సమ్మయ్య జెండా ఆవిష్కరించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పిట్టల సమ్మ య్య మాట్లాడుతూ.. ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) భారతదేశంలో ఏర్పాటైన తొలి కేంద్ర కార్మిక సంఘమని తెలిపారు. కార్యక మంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రేగుల కుమార్, జిల్లా నాయకులు కన్నం సదానందం, బొజ్జ సదానందం, ఎండీ బాదుల్లా, పిట్టల తిరుపతి, ఆరెపల్లి తిరుపతి, గోదారి లక్ష్మణ్, మహేందర్ రెడ్డి, ఓబుల్ రెడ్డి, పిట్టల వెంకటయ్య, సాయి, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా గాంధీ సేవలు చిరస్మరణీయం



శెనార్తి మీడియా, బెజ్జంకి: దేశంలోని పేదల ఆకలి తీర్చేందుకు 'గరీబీ హఠావో' నినాదంతో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన ఘనత మాజీ ప్రధాని ఇందిరా గాంధీకి దక్కుతుందని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కత్తి రమేశ్ గౌడ్ అన్నారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని బెజ్జంకి గ్రామపంచాయతీ ఆవరణలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పర్స సంతోష్, మార్కెట్ కమిటీ సభ్యులు ఇస్కిల్ల ఐలయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ గంగాధర రామచంద్రం, వార్డు సభ్యుడు బోనగాం రమేష్, మాజీ దేవస్థానం చైర్మన్ జెల్ల ప్రభాకర్ యాదవ్, యూత్ అధ్యక్షుడు కర్రాపుల సందీప్, బూట్ల చంద్ర ప్రకాష్, బోనగిరి ప్రసాద్, బండి వేణు, చిలుముల మోహన్, ఆయిలేని మహేందర్ రెడ్డి, బోనగం శంకర్, బోనగాం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జెండా గద్దెను తొలగించవద్దు




శెనార్తి మీడియా, గన్నేరువరం: గుండ్లపల్లి గ్రామంలోని ఎక్స్‌రోడ్డు వద్ద ఉన్న బీజేపీ జెండా గద్దెను తొలగించే ప్రయత్నాలను విరమించుకోవాలని బీజేపీ గన్నేరువరం మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ కోరారు. శనివారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన ఈ అంశంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. జెండా గద్దె తొలగింపుపై గ్రామ కార్యదర్శి, సర్పంచ్‌కు లిఖితపూర్వకంగా అభ్యంతర పత్రం అందజేశారు. రాజకీయ కక్షలకు తావులేకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యవహరించాలని సూచించారు. జెండా గద్దె పార్టీ గౌరవానికి, కార్యకర్తల ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని, జెండా గద్దె విషయంలో అనవసర రాజకీయాలు చేయడం తగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు ఏలేటి చంద్రారెడ్డి, రాష్ట్ర నాయకుడు సొల్లు అజయ్ వర్మ, మండల ప్రధాన కార్యదర్శులు బొమ్మాడి సురేందర్ రెడ్డి, పుల్లెల రాము, నాయకులు గాజ నరసింహస్వామి, అటికేం రామచంద్రం, గాద వెంకన్న, పుల్లెల జగన్మోహన్, చాడ రాజిరెడ్డి, తాళ్లపల్లి పరుశురాం, గుడెల్లి మల్లేశం, సాయిని మల్లేశం, పొలం కనకయ్య, హరీష్, పొలం వేణు, అభిలాష్, సాయి గణేష్, ముదిగంటి జలపతి రెడ్డి, మంచాల విట్టల్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ :ఒకరికి తీవ్రగాయాలు



శెనార్తి మీడియా, శంకరపట్నం: శంకరపట్నం మండలం కొత్తగట్టు జాతీయ రహదారిపై కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో నూనె లింగయ్య తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనలో ఆయన కాలు ఫ్రాక్చర్ కావడంతో రోడ్డుపై పడిపోయాడు. ప్రమాదంతో కొద్దిసేపు అక్కడ ఆందోళనకర పరిస్థితి నెలకొంది. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెల్త్ మెడికల్ ఆఫీసర్‌కు చెందిన దిగా స్థానికులు తెలిపారు.

39 ఏళ్ల ఉపాధ్యాయ సేవలకు ఘన సన్మానం



శెనార్తి మీడియా, శంకరపట్నం: ఉపాధ్యాయ వృత్తిలో 39 సంవత్సరాల పాటు గోపు రాజిరెడ్డి అందించిన సేవలు ప్రశంసనీయమని స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు కంకణాల నీరజ కొనియాడారు. ధర్మారం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపు రాజిరెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నీరజ ఆయన సేవలను గుర్తుచేసుకుని అభినందించారు. ఉద్యోగ విరమణ తర్వాత కూడా ఆసక్తి ఉన్న రంగంలో కొనసాగాలని సూచించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డిని మెమెంటో, శాలువాతో సత్కరించారు. సర్పంచ్ చింతిరెడ్డి పద్మ పాపిరెడ్డి, ఏఏపీసీ చైర్మన్ భారతి, పాఠశాల ఉపాధ్యాయుడు మదన్ సింగ్ ఆయన సేవలను ప్రశంసించారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు శ్రీనివాసరావు దేశ్ముఖ్, కేతిరి తిరుపతిరెడ్డితో పాటు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజిరెడ్డి కుటుంబ సభ్యులు, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం సహించేది లేదు

శెనార్తి మీడియా, శంకరపట్నం(హుజూరాబాద్): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత కలిగిన అధికారులు, సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే హెచ్చరించారు. శనివారం హుజూరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అన్ని వార్డులను సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న సదుపాయాలపై ఆరా తీశారు. వార్డుల్లో పరిస్థితులను పరిశీలించి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.




కవితాలోకాన కల్పవల్లి.. దేవులపల్లి

నేడు కృష్ణశాస్త్రి జన్మదినం

ఆయన కవిత్వంలో భావుకత్వం వెల్లివిరుస్తుంది.. ఆయన రాసే గీతాల్లో లాలిత్యం పాఠకులను తన్మయత్వంలో మునిగితేలేలా చేస్తుంది. తెలుగు కవిత్వ లోకాన ఆయన ఓ ప్రముఖ అధ్యాయం. తెలుగు సినిమా రంగాన ఆయన పాటలు జగద్విఖ్యాతం. ఆంధ్రా షెల్లీగా ప్రఖ్యాతి గాంచి "కృష్ణపక్షం" వంటి గొప్ప రచనను తెలుగు పాఠకులకు అందించిన ఆ మేటి సాహితీ దురంధరుడే "దేవులపల్లి కృష్ణశాస్త్రి". దేవులపల్లి కృష్ణశాస్త్రి తూర్పు గోదావరి జిల్లా, పిఠాపురం దగ్గరలోని రామచంద్రపాలెం గ్రామంలో తమ్మన్నశాస్త్రి, సీతమ్మ దంపతులకు నవంబరు 1, 1897 తేదీన జన్మించారు. అతని విద్యాభ్యాసమంతా పిఠాపురం పాఠశాలలో సాగింది. పాఠశాల రోజుల్లోనే కూచి నరసింహం, రఘుపతి వెంకటరత్నం వంటి రచయితల వద్ద ఆంగ్ల సాహిత్యాన్ని ఔపోసన పట్టాడు కృష్ణశాస్త్రి. 1918లో విజయ నగరం వెళ్లి డిగ్రీ చేస్తున్న రోజుల్లోనే ఆయనకు కవిత్వం రాయడం పట్ల మమకారం ఏర్పడింది. డిగ్రీ పూర్తి చేసి పెద్దాపురంలో ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో చేరాక ఆయన పూర్తిస్థాయిలో రచనా వ్యాసంగాన్ని మొదలు పెట్టారు. బ్రహ్మసమాజం లోను, నవ్య సాహితీసమితి లోను సభ్యునిగా, భావ కవిత్వోద్యమ ప్రవర్తకునిగా దేశమంతటా ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సమయంలో ఎందరో కవులతోను, పండితులతోను పరిచయాలు కలిగాయి. ప్రాచ్య, పాశ్చాత్య సాహిత్యాన్ని అధ్యయనం చేశారు. పిఠాపురంలోని హరిజన వసతి గృహంతో సంబంధం ఏర్పరచుకొని హరిజనోద్ధరణ కార్యక్రమాలలో పాల్గొన్నందున బంధువులు అతనిని వెలివేశారు. అయినా వెనుకాడని కృష్ణశాస్త్రి వేశ్యావివాహ సంస్థను ఏర్పాటు చేసి ఎందరో కళావంతులకు వివాహాలు నిర్వహించారు. 1922లో కృష్ణశాస్త్రి సతీమణి అర్ధాంతరంగా మరణించడంతో కొన్నాళ్లు అదే బాధలో గడిపారు ఆయన. అదే బాధలో అనేక విషాద కవితలు రాశారు. ఊహా ప్రేయసి, ఆత్మాశ్రయత్వం, ప్రవాసము, ఊర్వశి వంటి ఖండకావ్యాలు అలా పుట్టినవే. 1929లో రవీంద్ర నాథ్ టాగుర్‌తో ఏర్పడిన పరిచయం కృష్ణశాస్త్రి జీవితాన్ని మరో మలుపు తిప్పింది. మరిన్ని కవితా రచనలను చేసేలా ప్రేరేపించింది. లాలిత్యం, సౌరభ్యం, ప్రకృతి సౌందర్యం – కృష్ణశాస్త్రి పాటల్లోని ప్రధాన లక్షణాలు. భావోద్వేగాలకు, హృదయ స్పందనలకు అక్షర రూపమిచ్చి భావ కవితలంత సుకుమారంగా ప్రణయ విరహ గీతాల్ని రాసిన కవి. చందమామ లోని చల్లదనాన్ని, మందార పువ్వులోని మకరందాన్ని, గుండెలోని ఆర్ద్రతని రంగరించి రాస్తే అది కృష్ణశాస్త్రి పాటవుతుంది. పట్టు పరికిణిలో ఒదిగిన సింగారం కృష్ణశాస్త్రి పాట. ఆయన తెలుగు పదం అమ్మమ్మ చేతిలో నేతి నైవేద్యం. వర్షం వచ్చేముందు వీచే చల్లనిగాలి తెమ్మెర తనువును తాకితే ఎంత పులకరిస్తామో, కృష్ణశాస్త్రి కవిత వింటుంటే అదే పులకరింత వీనుల విందుగా వస్తుంది. భావ కవిత్వానికి సినిమా పాటల ద్వారా ఒక శాశ్వత స్థానాన్ని ఏర్పాటు చేసి, దిశానిర్దేశం చేసిన అతి కొద్ది మంది కవులలో కృష్ణశాస్త్రి ముందుంటారు. తెలుగు సినిమాల్లో జనని జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి.. అని భరతమాతను కీర్తించినా, జయ జయ జయ ప్రియ భారత జనయిత్రీ దివ్య ధాత్రి.. అంటూ దేశభక్తిని చాటినా.. ఆకులో ఆకునై, పువ్వులో పువ్వునై, ననులేత రెమ్మనై, సెలయేటిలో పాటనై, తెరచాటు తేటినై, నీలంపు నిగ్గునై... అని మగువ ఆర్ద్రతకు పెద్దపీట వేసినా అది కృష్ణశాస్త్రికే చెల్లింది. భావ కవిగా, 'ఆంధ్రా షెల్లీ 'గా ప్రసిద్ధులైన దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి... 1942లో బి.ఎన్.రెడ్డి ప్రోత్సాహంతో 'మల్లీశ్వరి (1951)'తో చిత్రరంగంలో అడుగుపెట్టి, సినిమా పాటకు కావ్య గౌరవం కలిగించి, మల్లీశ్వరితో ప్రారంభించి కృష్ణశాస్త్రి ఎన్నో చక్కని సినిమా పాటలు అందించారు. అవి సామాన్యులనూ, పండితులనూ కూడా మెప్పించే సాహితీ పుష్పాలు. తరువాత అనేక చిత్రాలకు సాహిత్యం అందించాడు. 1957లో ఆకాశవాణిలో చేరి తెలుగు సాహిత్య ప్రయోక్తగా అనేక గేయాలు, నాటికలు, ప్రసంగాలు అందించారు. పిలచిన బిగువటరా, – మనసున మల్లెల మాలలు, ఆకాశ వీధిలో హాయిగా , ఔనా.. నిజమేనా? సడి సేయకో గాలి ప్రతి రాత్రి వసంత రాత్రి, రానిక నీకోసం, ఆకులో ఆకునై, ఆరనీకుమా ఈ దీపం, గోరింట పూచింది, పగలైతే దొరవేరా, గట్టుకాడ ఎవరో, కుశలమా.. నీకు కుశలమేనా, చుక్కలతో చెప్పాలని, అడుగడుగున గుడి ఉంది, రావమ్మా మహాలక్ష్మి, ఎవరు నేర్పేరమ్మ ఈ కొమ్మకు, ఈనాటి బంధం ఏనాటిదో, వేళ చూస్తే.. సందె వేళ, చీకటి వెలుగుల కౌగిటిలో, పాడనా తెనుగు పాట, ఇది మల్లెల వేళయనీ, మావిచిగురు తినగానే, లాంటి పాటలు సినీ సాహిత్యంలో అజరామరాలు. 1975లో–ఆంధ్ర విశ్వవిద్యాలయం – కళాప్రపూర్ణ, 1978లో సాహిత్య అకాడమీ అవార్డు, 1976లో పద్మ భూషణ్ దేవులపల్లి ని వరించాయి. 1964 లో తిరుపతిలో అన్నమయ్య జయంతి ఉత్సవంలో కృష్ణశాస్త్రి పాల్గొన్నారు. ఆయన వెంట బాలాంత్రపు రజనీ కాంతరావు కూడా వెళ్ళారు. ఉపన్యాసం చదివేందుకు ఉద్యుక్తుడైన కృష్ణశాస్త్రి గొంతు బొంగురు పోయింది. దాంతో తన ఉపన్యాసాన్ని రజనీకాంతరావు చేత చదివించారు. వైద్య పరీక్షల్లో అది గొంతు క్యాన్సర్ అని నిర్ధారణ అయింది. మద్రాసులో కృష్ణశాస్త్రి స్వరపేటికను తొలగించారు. స్వరపేటిక తొలగించిన తరువాత కృష్ణశాస్త్రి దాదాపు పదహారేళ్లు బ్రతికినా, మూగవోయిన కంఠంతోనే అనేక సినిమాలకు పాటలు, ఆకాశవాణికి లలిత గీతాలు రాశారు. 1980 ఫిబ్రవరి 24న కృష్ణశాస్త్రి మరణించారు. తెలుగు దేశపు నిలువుటద్దం బద్దలైంది. షెల్లీ మళ్లీ మరణించాడు' అంటూ కృష్ణశాస్త్రి చనిపోయిన రోజున శ్రీశ్రీ రోదించాడు. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ స్పందిస్తూ 'ఒక్క షెల్లీ యే కాదు, కీట్స్, వర్డ్స్‌వర్త్ వంటి మహాశయుల సంయుక్త స్వరూపం కృష్ణశాస్త్రి' అన్నారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం



ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుంచి విడిపోయి 1953, అక్టోబర్ 1న ఆంధ్ర రాష్ట్రం అవతరించగా 1956 నవంబర్ 1న హైదరాబాద్ రాష్ట్రం విలీనం కావడంతో ఆంధ్ర రాష్ట్రం ఆంధ్ర ప్రదేశ్ గా మారింది. దేశంలో తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గుర్తింపు పొందింది. భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు చేయాలన్న అమరజీవి పొట్టి శ్రీరాములు కృషి సాకారం అయిన నిజమైన దినం. ఆ రోజునే ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవంగా జరుపుకుంటూ వచ్చారు. 2014 జూన్ 2న రాష్ట్రం విడిపోయిన తర్వాత చంద్రబాబు ప్రభుత్వం సంప్రదాయంగా వస్తున్న అవతరణ దినోత్సవానికి స్వస్తి పలికి, జూన్ 2న నవ నిర్మాణ దీక్షలను చేపట్టింది. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని ఎప్పుడు జరపాలో తెలపాలని చంద్రబాబు హయాంలో అధికారులు కేంద్ర హోం శాఖను కోరారు. దీనిపై కేంద్ర హోం శాఖ .. ఆంధ్రప్రదేశ్ ఒరిజనల్ బ్రాండ్ ఇమేజ్‌ను కోల్పోకుండా ఉండాలంటే గతంలో లాగానే నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని నిర్వహించు కోవాలని స్పష్టం చేసింది. అలా విడిపోయిన నాలుగు రాష్ట్రాలు ఆ విభజన తేదీ నాడే అవతరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాయని, అసలు రాష్ట్రాలు మాత్రం పాత అవతరణ తేదీ నాడు దినోత్సవాలనే చేసుకుంటున్నాయని కేంద్ర హోంశాఖ స్పష్టం చేసింది. ఫలితంగా నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని జరపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి ఆచరిస్తున్నది. ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుంచి విడిపోయి 1953, అక్టోబర్ 1న ఆంధ్ర రాష్ట్రం అవతరించగా.. 1956 నవంబర్ 1న హైదరాబాద్ రాష్ట్రం విలీనం అయిన నేపథ్యంలో ఆంధ్ర రాష్ట్రం .. ఆంధ్రప్రదేశ్‌గా మారింది. దేశంలో తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గుర్తింపు పొందింది. 2014 జూన్ 2న రాష్ట్రం విడిపోయాక.. జూన్ 2న తెలంగాణ అవతరణ దినోత్సవం జరుపు కోవడం అనవాయితీ గా మారింది. మద్రాసు ప్రెసిడెన్సీలో 40 శాతం జనసంఖ్య, 58 శాతం రాష్ట్ర విస్తీర్ణం తెలుగు వారిదే. రాష్ట్ర రాజకీయాలలో తమకు పలుకుబడి లేదని, తమిళుల చేత అవహేళనకు గురౌతున్నామన్న భావన తెలుగు వారిలో మెదలైంది. 1911 లో ఆనాటి వార్తా పత్రికల వ్యాసాల ద్వారా, సంపాదకీయం ద్వారా తెలుగు ప్రజలలో ప్రత్యేక రాష్ట్ర వాంఛ మొదలైంది. 1911 చివరి నాటికి ప్రత్యేక రాష్ట్ర చర్చ ఊపందుకుంది. తమిళులలో మాత్రం ఈ ప్రతిపాదనకు వ్యతిరేకత వ్యక్తమైయ్యింది. పట్టాభి సీతారామయ్య మాత్రం ఆంధ్ర ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా, దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాలు కావాలని సూచించారు. తెలుగు మాట్లాడే ప్రజలందరూ ఒకే రాష్ట్రంగా ఏర్పడాలనే అభిప్రాయాలు ఆంధ్రరాష్ట్ర ఉద్యమం ప్రారంభమైనప్పటి నుండి వినబడు తుండేది. 1938 లో ఆచార్య మామిడిపూడి వెంకట రంగయ్య, సమైక్య తెలుగు రాష్ట్రం ఏర్పడే అవకాశాల గురించి మాట్లాడారు. 1940లో, 1942లో ఆంధ్ర నాయకులు సమైక్య తెలుగు రాష్ట్రం గురించి తమ ఆశాభావాలను వ్యక్తం చేశారు. హైదరాబాద్ సంస్థానం విమోచన తర్వాత సమైక్య తెలుగు రాష్ట్రం ఏర్పాటుకు అవకాశాలు పెరిగాయి. 1949 లో అయ్యదేవర కాళేశ్వరరావు విశాలాంధ్ర మహాసభ ఏర్పాటు చేశారు. 1951 లో కూడా కాంగ్రెస్ అఖిల భారత సమావేశాలలో ఆంధ్ర కాంగ్రెస్ నాయకులు విశాలాంధ్ర విషయాన్ని ప్రస్తావించారు. పొట్టి శ్రీరాములు అక్టోబర్ 19, 1952లో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర డిమాండ్‌తో మద్రాసులో ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. 50రోజుల నిరహార దీక్ష తరువాత, మద్రాసును వదులుకొంటే ఆంధ్ర రాష్ట్ర నిర్మాణం సాధ్యపడుతుందని ప్రధాని నెహ్రూ ప్రకటించారు. పొట్టి శ్రీరాములు అందుకు అంగీకరించకుండా తన నిరాహార దీక్షను కొనసాగించి డిసెంబర్ 15వ తేదీన ఆత్మార్పణ చేసుకొన్నారు. ఆయన ఆత్మార్పణ తరువాత ఆంధ్ర ప్రాంత జిల్లాల్లో పెద్దయెత్తున హింసాకాండ చెలరేగింది. మద్రాసు నగరాన్ని మినహాయించి మద్రాసు రాష్ట్రంలోని తెలుగు జిల్లాలతో ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేస్తామని ప్రధాని నెహ్రూ లోక్‌సభలో ప్రకటించారు. ఆర్థికపరమైన, పాలనా పరమైన విషయాలను దృష్టిలో ఉంచుకొని విభజన ప్రక్రియలో అవసరమైన సిఫారసులు చేయడానికి జస్టిస్ కైలాసనాథ్ వాంచూను ప్రత్యేకాధికారిగా కేంద్ర ప్రభుత్వం నియమించింది. వాంచూ నివేదిక ప్రకారంగా ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటును 1953 మార్చి 25న నెహ్రూ ప్రకటించారు. ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు ప్రకటనతో రాయలసీమ శాసనసభ్యులు రాజధాని విషయంలో శ్రీబాగ్ ఒడంబడికను పాటించాలని కోరారు. ఆచార్య రంగా నాయకత్వంలోని కృషిక్ లోక్‌పార్టీ తిరుపతిని ఆంధ్ర రాష్ట్ర రాజధానిగా చేయాలని కోరారు. కమ్యూనిష్టులు విజయవాడను రాజధానిగా చేయాలని కోరారు. చివరకు కర్నూలును ఆంధ్ర రాష్ట్ర తాత్కాలిక రాజధానిగా అందరూ ఒప్పుకున్నారు. 1953 వ సంవత్సరం ఇదే రోజు పదకొండు తెలుగు మాట్లాడే జిల్లాలు కలిసి ప్రత్యేక రాష్ట్రంగా అవతరించాయి. అంతకు ముందు ఇవి మద్రాస్ రాష్ట్రంలో ఉండేవి. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా టంగుటూరి ప్రకాశం పంతులు పనిచేసారు. అనంతరం 1956 నవంబర్ ఇదే రోజున నిజాం పాలనలో ఉన్న తెలంగాణా ప్రాంతాన్ని ఆంధ్ర ప్రదేశ్ లో విలీనం చేసారు. 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడ్డాక, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు పై ఒత్తిడి పెరిగింది. కాంగ్రెసు, కమ్యూనిస్టులతో సహా అన్ని ప్రముఖ రాజకీయ పార్టీలూ దీనిని సమర్థించడంతో విశాలాంధ్ర స్వప్నం నిజమయే రోజు దగ్గర పడింది. 1953 డిసెంబరులో సయ్యద్ ఫజల్ ఆలీ నేతృత్వంలో రాష్ట్రాల పునర్విభజన కమిషను ఏర్పాటయింది. 1955 సెప్టెంబర్ 30 న తన నివేదిక సమర్పించింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అది సమర్థించింది. మరాఠీ మాట్లాడే ప్రాంతాలను మహారాష్ట్ర లోను, కన్నడం మాట్లాడే ప్రాంతాలను కర్ణాటక లోను కలిపి తెలుగు మాట్లాడే ప్రాంతాలను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చెయ్యాలని సూచించింది. అయితే ఐదు సంవత్సరాల తరువాత రాష్ట్ర శాసనసభలో మూడింట రెండు వంతులు సభ్యులు ఒప్పుకుంటే, ఆంధ్రతో విలీనం చెయ్యవచ్చని కూడా సూచించింది. కమిషను సూచనలను ఆహ్వానించి, ప్రత్యేక రాష్ట్రవాదనను సమర్థించిన వారిలో కె.వి.రంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డి ప్రముఖులు. హైదరాబాద్ శాసనసభలో అధిక శాతం సభ్యులు ఆంధ్ర ప్రదేశ్‌ను సమర్థించారు. శాసనసభలో ఈ విషయంపై చర్చ జరిగినపుడు, 103 మంది సభ్యులు ఆంధ్ర ప్రదేశ్‌కు మద్దతు తెలుపగా, 29 మంది మాత్రమే వ్యతిరేకించారు. 15 మంది తటస్థంగా ఉండి పోయారు. ఆంధ్ర ప్రదేశ్‌ను సమర్థించిన ప్రముఖ నాయకులలో అప్పటి ముఖ్యమంత్రి బూరుగుల రామకృష్ణా రావు, మాడపాటి హనుమంత రావు, స్వామి రామానంద తీర్థ మొదలైనవారు ఉన్నారు. దీని నివేదికపై తెలంగాణ, విశాలాంధ్ర వాదులు తమతమ వాదనలను తీవ్రతరం చేసారు. కమ్యూనిస్టులు తీవ్రంగా ప్రతిస్పందిస్తూ, హైదరాబాదు శాసనసభకు రాజీనామా చేసి, ఈ విషయంపై ఎన్నికలకు వెళ్తామని ప్రకటించారు. కాంగ్రెసు అధిష్ఠానం కూడా ఆంధ్ర ప్రదేశ్‌నే సమర్థించి, ఆంధ్ర, తెలంగాణా నాయకులను తమ విభేదాలను పరిష్కరించు కొమ్మని ఒత్తిడి చేసింది. 1956 ఫిబ్రవరి 20 న ఢిల్లీలో రెండు ప్రాంతాల నాయకులు సమావేశ మయ్యారు. తెలంగాణా తరపున బూరుగుల రామకృష్ణా రావు, కె.వి.రంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డి, జె.వి.నర్సింగ్ రావు పాల్గొనగా, ఆంధ్ర తరపున బెజవాడ గోపాలరెడ్డి, నీలం సంజీవరెడ్డి, గౌతు లచ్చన్న, అల్లూరి సత్యనారాయణ రాజు సమావేశాల్లో పాల్గొన్నారు. ఆ విధంగా అనేక చర్చలు, సంప్రదింపుల అనంతరం 1956 జూలై 19 న వారిమధ్య పెద్ద మనుషుల ఒప్పందం కుదిరింది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటుకు మార్గం సుగమమైంది. 1956 నవంబర్ 1న అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ చేతుల మీదుగా ఆంధ్ర ప్రదేశ్ ఆవిర్భవించింది. నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాడు. అప్పటి వరకు హైదరాబాద్ ముఖ్య మంత్రిగా ఉన్న బూరుగుల రామకృష్ణా రావుకు కేరళ గవర్నరు పదవి లభించింది. ఆంధ్ర రాష్ట్ర గవర్నరు అయిన సి.ఎం.త్రివేది, ఆంధ్ర ప్రదేశ్ తొలి గవర్నరుగా కొనసాగాడు. ఆంధ్ర ప్రదేశ్ అవతరణ దినోత్సవంను నవంబరు 1వ తేదీగా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఖరారు చేసింది. ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుంచి విడిపోయి 1953, అక్టోబర్ 1న ఆంధ్ర రాష్ట్రం అవతరించగా 1956 నవంబర్ 1న హైదరాబాద్ రాష్ట్రం విలీనం కావడంతో ఆంధ్ర రాష్ట్రం కాస్తా ఆంధ్ర ప్రదేశ్ గా మారింది. దేశంలో తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ గుర్తింపు పొందింది. భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు చేయాలన్న అమరజీవి పొట్టి శ్రీరాములు ఆలోచన సాకారమైన దినమిది. ఆ రోజునే ఆంధ్ర ప్రదేశ్ అవతరణ దినోత్సవంగా జరుపు కుంటూ వచ్చారు. రెండు రాష్ట్రాలు విడి పోయిన తరువాత రాష్ట్ర విభజన జరిగిన జూన్ 2 వ తేదీన అపాయింట్ డే గా ప్రకటించి ప్రతి సంవత్సరం 2 వ తేదీ నుంచి జూన్ 8 వరకూ నవ నిర్మాణ దీక్ష పేరుతొ ఉత్సవాలు చేస్తూ వచ్చేది గత ప్రభుత్వం అధికారికంగా ఆంధ్ర ప్రదేశ్ అవతరణ దినోత్సవం జరుపు కోవడం లేదు. జగన్ సీఎం అయినాక నవంబర్ 1న ఆంధ్ర ప్రదేశ్ అవతరణ దినోత్సవం నిర్వహించాలని అధికారికంగా నిర్ణయించి పాటించగా, ప్రస్తుత చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం నవంబర్ 1నే జరపాలని నిర్ణయించింది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

తెలంగాణ ప్రజాసాహిత్య పితామహుడు వట్టికోట

నేడు వట్టికోట ఆళ్వారుస్వామి జయంతి

తెలంగాణ ప్రజాసాహిత్య చరిత్రలో వట్టికోట ఆళ్వారుస్వామి ఒక మహోన్నత స్థానం పొందారు. ఆయన కేవలం రచయిత మాత్రమే కాకుండా ఉద్యమకర్త, కమ్యూనిస్టు నాయకుడు, ప్రచురణకర్త, పాత్రికేయుడిగా విభిన్న రంగాలలో సేవలందించారు. భాషా సాహిత్యం నుంచి పౌరహక్కుల ఉద్యమాల వరకు అనేక రంగాలలో ఆయన తన ప్రతిభను ప్రదర్శించారు. ఆయనకు "తెలంగాణ ప్రజాసాహిత్య పితామహుడు" అనే బిరుదు అందించారు.

బాల్యం మరియు ప్రారంభ జీవితం

1915 నవంబర్ 1న నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలంలోని చెరువు మాదారం అనే గ్రామంలో జన్మించిన ఆళ్వారుస్వామి, చిన్నతనం నుండే సామాజిక అన్యాయాలను గమనించారు. ఈ అన్యాయాలు ఆయనలో చైతన్యాన్ని, మార్పు తపనను రేకెత్తించాయి. ఆయనకు సాహిత్యం పట్ల ఉన్న ఆసక్తిని "గ్రంథాలయోద్యమం" మరింత పెంచింది. నిజాం పాలనలో ఉన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ దౌర్జన్యాలు ఆయనను రాజకీయాల వైపు నడిపించాయి. వట్టికోట ఆళ్వారుస్వామి నిజాం పాలనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. పేద ప్రజల పట్ల అన్యాయం, వివక్షలపై ఆయన గళం ఎత్తారు. ఈ ఉద్యమంలో ఆయన అనేక సార్లు జైలు శిక్ష అనుభవించారు. జైలు జీవితం ఆయన వ్యక్తిత్వం, సాహిత్యం పై విపరీతమైన ప్రభావం చూపింది. జైలులో ఉన్నప్పుడు ఆయన తన అనుభవాలను కథల రూపంలో అభివ్యక్తం చేయడం ప్రారంభించారు. "జైలు లోపల" అనే కథా సంపుటి ఆయన జైలు అనుభవాలకు



ప్రతిబింబంగా నిలిచింది, ఇందులో జైలు లోపల నిర్బంధితుల జీవితం, వారి బాధలు వాస్తవానికి దగ్గరగా ఉంటాయి. తెలుగులో రాజకీయ నవలలను రచించిన మొట్ట మొదటి వ్యక్తిగా వట్టికోట ఆళ్వారు స్వామి ప్రసిద్ధి చెందారు. ఆయన "ప్రజల మనిషి" అనే నవల రచించి తెలంగాణ ప్రజల జీవన పరిస్థితులను, సామాజిక అన్యాయాలను, ప్రజల మానసిక స్థితిగతులను ప్రతిబింబించారు. ఈ నవల ఆనాటి సామాజిక, రాజకీయ పరిస్థితులపై తీవ్ర విమర్శగా నిలిచింది. వట్టికోట రచనల్లోని కథలు, నాటికలు సమాజాన్ని విమర్శిస్తూ, ప్రజలను చైతన్యవంతం చేసే లక్ష్యంతో ఉన్నవి. సురవరం ప్రతాప రెడ్డి హైదరాబాద్ లో స్థాపించిన "గోలకొండ" పత్రిక లో ప్రూఫ్ రీడర్ గా పని చేసారు. వట్టికోట ఎల్లప్పుడూ ప్రజాస్వామ్య విలువలను గౌరవించి, ప్రజా స్వేచ్ఛను కాపాడటానికి కృషి చేశారు. సమాజంలో న్యాయం, సమానత్వం రావాలనే ఆశయంతో ఆయన అనేక కార్యక్రమాలలో పాల్గొన్నారు. వట్టికోట ప్రజాసాహిత్య చైతన్యానికి ఒక బలమైన పునాదిగా నిలిచారు. ప్రజల జీవన గాధలను సాహిత్యంలోకి తీసుకురావడం ద్వారా సామాజిక మార్పు తపనను ప్రేరేపించారు. తెలంగాణా లో స్టేట్ కాంగ్రెస్, ఆర్య సమాజం, ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీ, అభ్యుదయ రచయితల సంఘం, తెలంగాణా రచయితల సంఘం వంటి సామాజిక, రాజకీయ సాహిత్య సంస్థలలో కార్యకర్తగా, నాయకుడిగా పనిచేశారు. హైదరాబాద్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్, 1944లో గుమాస్తాలు సంఘం, రిక్షాకార్మిక సంఘం, రైల్వే ఉద్యోగులు, కార్మిక ఉద్యోగుల సంఘాలకు నాయకత్వం వహించారు. దాశరధి వట్టికోట కలసి 1948 లో మూడు నెలలు నిజామాబాద్ జైలులో ఉన్నారు. దాశరథి పద్యాలు జైలు గోడల మీద రాసి దెబ్బలు తిన్నారు. వట్టికోట ఆళ్వారుస్వామి కేవలం ఒక రచయిత మాత్రమే కాకుండా సమాజ సేవకుడు, ఉద్యమకర్త, ప్రజల చైతన్య దాత అని చెప్పవచ్చు. ఆయన రచనలు ప్రజల బాధలను, వారి ఆశయాలను ప్రతిబింబిస్తూ, ప్రజాస్వామ్య పునాదుల స్థాపనకు తోడ్పడతాయి. ఆయన సాహిత్యం తెలంగాణ ప్రజాసాహిత్యంలో ఒక అద్భుతమైన అధ్యాయంగా నిలిచిపోతుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

అర్ధశతాబ్దపు ప్రస్థానం


మహిళా క్రికెట్‌కు స్వర్ణోత్సవం!

- భారత మహిళల తొలి టెస్టుకు నేటితో 50 ఏళ్లు
- 1976 అక్టోబర్ 31న వెస్టిండీస్‌తో చారిత్రక అరంగేట్రం
- తొలి మ్యాచ్‌లోనే ఐదు వికెట్లతో మెరిసిన శుభాంగి కులకర్ణి
- అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి సిక్సర్ బాదిన శాంతా రంగస్వామి
- ఐదు దశాబ్దాల మహిళా క్రికెట్ ప్రయాణాన్ని గుర్తుచేసిన బీసీసీఐ
- మాజీ కెప్టెన్లకు ప్రత్యేక సత్కారం.. నాటి త్యాగాలకు ఘన నివాళి



బెంగళూరు, అక్టోబర్ 31 : భారత మహిళల క్రికెట్ చరిత్రలో అక్టోబర్ 31కు ప్రత్యేక స్థానం ఉంది. సరిగ్గా 50 ఏళ్ల క్రితం ఇదే రోజు భారత మహిళల జట్టు అంతర్జాతీయ టెస్టు క్రికెట్‌లో తొలి అడుగు వేసింది. 1976 అక్టోబర్ 31న బెంగళూరులోని ఎం.చిన్నస్వామి స్టేడియంలో వెస్టిండీస్‌తో తొలి అధికారిక టెస్టు మ్యాచ్ ఆడింది. ఆ చారిత్రక ఘట్టానికి అర్ధశతాబ్దం పూర్తయిన సందర్భంగా భారత క్రికెట్ నియంత్రణ మండలి ప్రత్యేకంగా స్పందించింది. సామాజిక మాధ్యమాల్లో మహిళల క్రికెట్ ప్రస్థానాన్ని గుర్తుచేస్తూ ప్రత్యేక సందేశాన్ని పంచుకుంది. భారత మహిళల క్రికెట్ అభివృద్ధికి పునాదులు వేసిన మాజీ కెప్టెన్లను సత్కరించి వారి సేవలను కొనియాడింది. భారత మహిళల తొలి టెస్టులో 17 ఏళ్ల లెగ్ స్పిన్నర్ శుభాంగి కులకర్ణి అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. అరంగేట్ర మ్యాచ్‌లోనే ఐదు వికెట్లు పడగొట్టి వెస్టిండీస్‌ను 274 పరుగులకు పరిమితం చేయడంలో కీలక పాత్ర పోషించింది. తొలి అంతర్జాతీయ టెస్టులోనే భారత మహిళా బౌలర్ ఈ స్థాయిలో రాణించడం అప్పట్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

అదే మ్యాచ్‌లో భారత కెప్టెన్ శాంతా రంగస్వామి మరో చారిత్రక ఘట్టాన్ని నమోదు చేసింది. వెస్టిండీస్ బౌలర్ ప్యాట్రిషియా విటేకర్ బౌలింగ్‌లో లాంగ్ ఆన్, మిడ్ వికెట్ మధ్య భారీ సిక్సర్ బాదింది. భారత మహిళల అధికారిక అంతర్జాతీయ క్రికెట్‌లో నమోదైన తొలి సిక్సర్‌గా అది చరిత్రలో నిలిచింది. భారత్ 269 పరుగులకు ఆరు వికెట్ల వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసి విజయానికి ప్రయత్నించింది. అయితే చివరి రోజు ఆట ఆలస్యంగా ప్రారంభం కావడంతో మూడు రోజుల టెస్టు డ్రాగా ముగిసింది. నేడు భారత మహిళల క్రికెట్ ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్ వంటి స్టార్ క్రికెటర్లు కోట్లాది మంది అభిమానులను సొంతం చేసుకున్నారు. బీసీసీఐ ఒప్పందాలు, మహిళల ప్రీమియర్ లీగ్, వాణిజ్య ప్రకటనల ద్వారా మహిళా క్రికెటర్లకు ఆదాయ అవకాశాలు పెరిగాయి. అయితే ఈ స్థాయికి చేరుకోవడం వెనుక గత తరాల క్రీడాకారిణుల కృషి, త్యాగాలు ఎంతో ఉన్నాయి. సరైన మౌలిక సదుపాయాలు, ఆర్థిక ప్రోత్సాహం, ప్రజాదరణ పరిమితంగా ఉన్న రోజుల్లోనూ మహిళా క్రికెటర్లు పట్టుదలతో ముందుకు సాగారు. వారి పోరాటమే నేటి తరానికి బలమైన పునాదిగా నిలిచింది. క్రికెట్‌కు పుట్టిల్లుగా పేరొందిన లార్డ్స్ మైదానంలో మహిళల టెస్టు క్రికెట్‌కు ప్రత్యేక గుర్తింపు లభించింది. పురుషుల తొలి టెస్టు జరిగిన అనేక దశాబ్దాల తర్వాత ఈ ప్రతిష్ఠాత్మక మైదానంలో మహిళల టెస్టుకు అవకాశం దక్కింది. ఇంగ్లండ్‌తో జరిగిన పోరులో భారత మహిళల జట్టు 270 పరుగుల తేడాతో విజయం సాధించడం మరో చారిత్రక ఘట్టంగా నిలిచింది. ఈ విజయం మహిళల క్రికెట్ ఎదుగుదలను అంతర్జాతీయ వేదికపై చాటిచెప్పింది. ఐదు దశాబ్దాల క్రితం పరిమిత అవకాశాల మధ్య ప్రారంభమైన భారత మహిళల టెస్టు ప్రయాణం నేడు కొత్త శిఖరాలకు చేరుకుంది. తొలి తరం క్రీడాకారిణులు వేసిన పునాదులపై నేటి తరం ప్రపంచ క్రికెట్‌లో సత్తా చాటుతోంది. మహిళల క్రికెట్‌కు పెరుగుతున్న ఆదరణ, అవకాశాలు, పెట్టుబడులు ఈ ప్రయాణంలో కీలక మైలురాళ్లుగా నిలుస్తున్నాయి. 1976లో బెంగళూరు మైదానంలో పడిన తొలి అడుగు.. నేడు కోట్లాది మంది అమ్మాయిల కలలకు స్ఫూర్తిగా మారింది. భారత మహిళల క్రికెట్‌కు 50 ఏళ్లు పూర్తవడం కేవలం ఒక వార్షికోత్సవం కాదు.. ఐదు దశాబ్దాల పట్టుదల, పోరాటం, విజయాలకు నిలువెత్తు నిదర్శనం!



పాక్ విజయానికి వారం సెలవు ఇవ్వాల్సిందే

ప్రధాని షహబాజ్ షరీఫ్‌పై ట్రోల్స్ వర్షం!

హాంకాంగ్, అక్టోబర్ 31 : పాకిస్థాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్‌పై సోషల్ మీడియాలో నెటిజన్లు తీవ్రస్థాయిలో ట్రోల్స్ వర్షం కురిపిస్తున్నారు. ఒక చిన్న క్రికెట్ టోర్నమెంట్‌లో భారత్‌పై పాకిస్థాన్ సాధించిన సాధారణ విజయానికి ఆయన స్పందించిన తీరే ఇందుకు ప్రధాన కారణమైంది. ప్రధాని చూపించిన అత్యుత్సాహం చూసి నెటిజన్లు తీవ్ర ఆశ్చర్యానికి గురయ్యారు. హాంకాంగ్ సిక్సెస్ టోర్నమెంట్‌లో భాగంగా శుక్రవారం భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య లీగ్ మ్యాచ్ జరిగింది. ఈ పోటీలో పాకిస్థాన్ జట్టు 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. అనధికారిక హోదా ఉన్న ఈ చిన్న టోర్నమెంట్ గ్రూప్ మ్యాచ్‌లో తమ జట్టు సాధించిన విజయానికి ప్రధాని షరీఫ్ అమితానందంతో ఉప్పొంగిపోయారు. అత్యంత ఉత్సాహంతో తమ జట్టు సభ్యులను ఆకాశానికెత్తుతూ ఆయన ఎక్స్ వేదికగా ఒక పోస్టు చేశారు. "భారత్‌పై అద్భుతమైన విజయాన్ని అందుకున్న మన కుర్రాళ్లకు హృదయపూర్వక అభినందనలు. అదొక అత్యుత్తమమైన మ్యాచ్. మన క్రీడాకారులకు నిరంతరం మద్దతు ఇవ్వడంలో అంకితభావంతో పనిచేసిన పీసీబీ ఛైర్మన్ మోసిన్ నఖ్వీ, ఆయన బృందానికి నా ప్రత్యేక అభినందనలు" అంటూ ప్రధాని పొగడ్తల వర్షం కురిపించారు. ప్రధాని చేసిన ఈ సుదీర్ఘ అభినందన పోస్టు క్షణాల్లో సోషల్ మీడియాలో వైరల్‌గా మారి తీవ్ర చర్చకు దారితీసింది. ఈ పరిణామంపై క్రీడాభిమానులు, నెటిజన్లు తీవ్ర స్థాయిలో వ్యంగ్యాస్త్రాలు విసురుతున్నారు. అదొక గల్లీ క్రికెట్ లాంటి వినోదాత్మక టోర్నమెంట్ అని, దానికి దేశ ప్రధాని స్థాయిలో అంత బిల్డప్ ఇవ్వాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నిస్తున్నారు. హాంకాంగ్ సిక్సెస్‌పై స్వయంగా ప్రధాని పోస్టు చేయడం తీవ్ర హాస్యాస్పదంగా ఉందంటూ కామెంట్లు పెడుతున్నారు. ఏదో ఆసియా కప్ లేదా ప్రపంచకప్‌ను మించిన మహా టోర్నీలో భారత్‌పై పాకిస్థాన్ విజయం సాధించినంతగా సంబరపడిపోతున్నారంటూ సెటైర్లు వేస్తున్నారు. ఈ చారిత్రాత్మక ఘన విజయానికి పాకిస్థాన్ ప్రజలకు కచ్చితంగా వారం రోజుల పాటు జాతీయ సెలవు ప్రకటించాల్సిందేనంటూ నెటిజన్లు విపరీతంగా ట్రోల్ చేస్తున్నారు.

మనీషా పసిడి పట్టు.. చరిత్రలో సరికొత్త అధ్యాయం!

- ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళ తొలి స్వర్ణం
- 59 కిలోల విభాగంలో విశ్వవిజేతగా మనీషా భన్వాలా
- ఫైనల్‌లో అమెరికా రెజ్లర్ అబిగెల్ నెట్టెపై 8--6తో విజయం
- 0-6తో వెనుకబడినా అద్భుతంగా పుంజుకున్న భారత రెజ్లర్
- సుశీల్ కుమార్ తర్వాత ప్రపంచ స్వర్ణం సాధించిన రెండో భారత రెజ్లర్
- కాజల్, నీలమ్‌కు రజతాలు.. రెజ్లింగ్‌లో భారత మహిళల సత్తా



ఆస్తానా, అక్టోబర్ 31 : ప్రపంచ రెజ్లింగ్ వేదికపై భారత మహిళా క్రీడాకారిణి మనీషా భన్వాలా చరిత్ర సృష్టించింది. ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ మహిళల 59 కిలోల విభాగంలో స్వర్ణ పతకం సాధించి భారత కీర్తిపతాకాన్ని రెపరెపలాడించింది. శుక్రవారం జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్ పోరులో అమెరికాకు చెందిన అబిగెల్ నెట్టెను 8-6 పాయింట్ల తేడాతో ఓడించి విశ్వవిజేతగా అవతరించింది. తద్వారా ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ మహిళల విభాగంలో స్వర్ణం సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా రికార్డు నెలకొల్పింది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత్ తరఫున స్వర్ణం గెలిచిన రెండో రెజ్లర్‌గా కూడా మనీషా నిలిచింది. అంతకుముందు 2010లో సుశీల్ కుమార్ పురుషుల 66 కిలోల విభాగంలో స్వర్ణ పతకం సాధించాడు. మనీషా స్వర్ణ పోరు ఆద్యంతం ఉత్కంఠగా సాగింది. ఫైనల్ ప్రారంభంలో అమెరికా రెజ్లర్ అబిగెల్ నెట్టె ఆధిపత్యం ప్రదర్శించింది. వరుస పాయింట్లు సాధించి 6-0తో ముందంజ వేసింది. దీంతో మనీషా ఓటమి తప్పదేమోనన్న పరిస్థితి ఏర్పడింది. అయితే విరామం తర్వాత భారత రెజ్లర్ అద్భుతంగా పుంజుకుంది. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా తన పట్టుతో ఉక్కిరిబిక్కిరి చేసింది. వరుసగా పాయింట్లు సాధిస్తూ ఆధిక్యాన్ని తగ్గించుకోవడమే కాకుండా చివరకు 8-6తో విజయాన్ని అందుకుంది. ఆరు పాయింట్లు వెనుకబడిన స్థితి నుంచి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్న మనీషా పోరాటపటిమ అందరినీ ఆకట్టుకుంది. ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారులు పతకాలు సాధించినప్పటికీ స్వర్ణ పతకం మాత్రం అరుదుగానే దక్కింది. 2010లో సుశీల్ కుమార్ సాధించిన చారిత్రక విజయం తర్వాత మరోసారి భారత రెజ్లింగ్‌కు ప్రపంచ స్వర్ణం అందించిన ఘనత మనీషాకు దక్కింది. అంతేకాకుండా మహిళల విభాగంలో ఈ ఘనత సాధించిన తొలి భారత రెజ్లర్‌గా ఆమె పేరు చరిత్రలో నిలిచిపోయింది. తాజా ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత మహిళా రెజ్లర్లు అద్భుత ప్రతిభ కనబరిచారు. మనీషాతోపాటు కాజల్, నీలమ్ కూడా తమ విభాగాల్లో ఫైనల్‌కు చేరుకున్నారు. అయితే తుది పోరులో ఓటమి ఎదురవడంతో వారిద్దరూ రజత పతకాలతో సరిపెట్టుకున్నారు. మనీషా మాత్రం ఆఖరి వరకు పోరాడి స్వర్ణ పతకాన్ని చేజిక్కించుకుంది. ప్రపంచస్థాయి పోటీల్లో భారత మహిళా రెజ్లర్లు వరుసగా పతకాలు సాధించడం దేశ రెజ్లింగ్ భవిష్యత్తుపై ఆశలు పెంచుతోంది. ముఖ్యంగా మనీషా సాధించిన చారిత్రక విజయం యువ క్రీడాకారిణులకు స్ఫూర్తిగా నిలవనుంది. ఒత్తిడిలోనూ పట్టుదల కోల్పోకుండా చివరి వరకు పోరాడితే విజయం సాధించవచ్చని ఆమె నిరూపించింది. ఆరు పాయింట్లు వెనుకబడినా ఆత్మవిశ్వాసం కోల్పోకుండా పోరాడిన మనీషా.. చివరకు ప్రపంచ స్వర్ణాన్ని తన పట్టులో బంధించింది. భారత మహిళా రెజ్లింగ్ చరిత్రలో ఆమె విజయం చిరస్మరణీయ ఘట్టంగా నిలిచిపోనుంది.



ఇలాగైతే కష్టమేనబ్బా 'సర్పంచ్ సాబ్'

కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ప్రదర్శనపై విమర్శలు!

ఆక్లాండ్, అక్టోబర్ 31 : మొత్తం పాతిక మ్యాచ్‌లు.. అందులో 14 విజయాలు.. తొమ్మిది ఓటములు.. అరే.. కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ ప్రోగ్రెస్ కార్డ్ బానే ఉంది కదా ఇంకేంటి సమస్య? అనే ప్రశ్నలు తలెత్తడం సహజమే. కానీ, న్యూజిలాండ్‌తో జరిగిన నాలుగో టీ20లో ఘోర ఓటమితో పాటు బ్యాటర్‌గానూ విఫలం కావడంతో అతడిపై విమర్శకుల దృష్టి పడింది. కివీస్‌తో వరుసగా మూడు మ్యాచుల్లో టీమ్ఇండియా విజయం సాధించినప్పటికీ.. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బ్యాటర్‌గా పరుగులు చేయకపోయినా జట్టు గెలిచిందిగా అని అభిమానులు సరిపెట్టుకున్నారు. కానీ, నాలుగో టీ20లో 87 పరుగుల తేడాతో భారీ ఓటమి ఎదురైంది. సారథి శ్రేయస్ 11 బంతుల్లో 22 పరుగులు చేసి కీలక సమయంలో పెవిలియన్‌కు చేరాడు. 260 పరుగుల లక్ష్య ఛేదనకు దిగినప్పుడు బాధ్యతాయుతంగా ఆడాల్సిన అవసరం ఉండగా, శ్రేయస్ 200 స్ట్రైక్‌రేట్‌తో పరుగులు చేసినప్పటికీ అది సరిపోలేదు. మిగతా బ్యాటర్లతో కలిసి భాగస్వామ్యాలను నిర్మించాల్సింది పోయి తేలికగా వికెట్ ఇచ్చేశాడు. ఇప్పటి వరకు ఈ సిరీస్‌లో అతడు ఆడిన నాలుగు మ్యాచుల్లో చేసిన పరుగులు కేవలం 76 మాత్రమే కావడం గమనార్హం. సూర్య కుమార్ బాటలోనే శ్రేయస్ పయనిస్తున్నారనే చర్చ జరుగుతోంది. సిరీస్‌లు, ట్రోఫీలు గెలిచినా సరే వ్యక్తిగత ఆట కూడా మెరుగ్గా ఉండాలని, లేకపోతే సూర్యకుమార్ యాదవ్ పరిస్థితే శ్రేయస్‌కూ తలెట్టే ప్రమాదం లేకపోలేదని విశ్లేషకులు భావిస్తున్నారు. సూర్య నాయకత్వంలో టీమ్ఇండియా వరల్డ్ కప్‌నూ నెగ్గినా, వ్యక్తిగతంగా బ్యాటింగ్‌లో రాణించకపోవడంతో ప్రస్తుతం జట్టులో స్థానం కోల్పోవాల్సి వచ్చింది. ఇటు శ్రేయస్ కూడా 25 మ్యాచుల్లో 666 పరుగులు రాబట్టినప్పటికీ, స్ట్రైక్‌రేట్ 147.7 మాత్రమే ఉంది. 2028 టీ20 ప్రపంచ కప్‌లో జట్టుకు నాయకత్వం వహించాలని అనుకుంటే మాత్రం తన బ్యాటింగ్‌కూ పదను పెట్టాల్సిందే. సిరీస్‌ను భారత్ ఇప్పటికే సొంతం చేసుకున్నప్పటికీ శ్రేయస్ కెప్టెన్సీపై విమర్శలు రావడానికి మరో ప్రధాన కారణం బౌలింగ్ మార్పులు. అతడు సారథ్యం చేపట్టాకే టీమ్ఇండియా భారీ తేడాతో ఓటములను చవిచూసింది. ఇంతకుముందు ఇంగ్లాండ్ చేతిలో 125 పరుగుల తేడాతో పరాజయం పాలవగా, ఇప్పుడు 87 రన్స్‌తో ఓడింది. ఈ రెండు మ్యాచ్‌లకూ శ్రేయసే కెప్టెన్. ఇక న్యూజిలాండ్ సిరీస్‌లోనూ అతడి నిర్ణయాలపై మాజీ క్రికెటర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. బౌలర్లకు కష్టకాలం నడుస్తున్న వేళ వారిని వినియోగించుకోవడంలో అయ్యర్ ఇబ్బంది పడినట్లు మహ్మద్ కైఫ్ వ్యాఖ్యానించాడు. ప్రధాన బౌలర్లను సరిగ్గా ఉపయోగించాలనే కనీస ఫార్ములాను శ్రేయస్ పక్కన పెట్టాడని అభిప్రాయపడ్డాడు. ఇకనైనా ఇలాంటి తప్పుల నుంచి శ్రేయస్ నేర్చుకుంటేనే సుదీర్ఘకాలం జట్టుకు నాయకత్వం వహించే అవకాశాలు ఉంటాయి.

సెమీస్‌లో సింధు జోరు.. లక్ష్య, అన్మోల్ హోరు!

హైలో ఓపెన్ బ్యాడ్మింటన్‌లో భారత షట్లర్ల సత్తా

సార్‌బ్రూకెన్ (జర్మనీ), అక్టోబర్ 31 : హైలో ఓపెన్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత షట్లర్లు అదరగొడుతున్నారు. స్టార్ క్రీడాకారిణి పీవీ సింధుతోపాటు యువ సంచలనం అన్మోల్ ఖర్బ్, పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లారు. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ పోటీల్లో ముగ్గురూ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ముఖ్యంగా సింధు కేవలం 27 నిమిషాల్లోనే ప్రత్యర్థిని చిత్తుచేయగా, అన్మోల్, లక్ష్య సేన్ మూడు గేమ్‌ల పోరులో విజయాలు సాధించారు. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్‌లో పీవీ సింధు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. ఆతిథ్య జర్మనీకి చెందిన అమేలీ షజ్‌ను 21-12, 21-10 తేడాతో వరుస గేమ్‌లలో ఓడించింది. ప్రారంభం నుంచే దూకుడుగా ఆడిన సింధు ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. పదునైన స్మాష్‌లు, చక్కటి కోర్టు కవరేజీతో పాయింట్లు సాధిస్తూ మ్యాచ్‌ను కేవలం 27 నిమిషాల్లో ముగించింది. ఈ విజయంతో టైటిల్‌కు మరో రెండు అడుగుల దూరంలో నిలిచింది. మరో మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్‌లో భారత యువ షట్లర్ అన్మోల్ ఖర్బ్ ఉ



త్కంఠభరిత విజయాన్ని అందుకుంది. భారత క్రీడాకారిణి ఉన్నతి హుడాతో జరిగిన పోరులో 21-17, 18-21, 21-16తో విజయం సాధించింది. తొలి గేమ్‌ను గెలుచుకున్న అన్మోల్ రెండో గేమ్‌ను కోల్పోయినా నిర్ణయాత్మక మూడో గేమ్‌లో పుంజుకుంది. కీలక సమయంలో వరుస పాయింట్లు సాధించి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. దీంతో సెమీఫైనల్‌లో సింధుతో తలపడేందుకు సిద్ధమైంది. ఇద్దరు భారత క్రీడాకారిణుల మధ్య జరగనున్న ఈ పోరుతో మహిళల సింగిల్స్‌లో భారత్‌కు ఫైనల్ స్థానం ఖాయమైంది. పురుషుల సింగిల్స్‌లో భారత స్టార్ షట్లర్ లక్ష్య సేన్ కూడా సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. ఫిన్లాండ్‌కు చెందిన కాల్ కొజోనెన్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్‌లో 14-21, 21-17, 21-13తో విజయం సాధించాడు. తొలి గేమ్‌లో ప్రత్యర్థి ఆధిపత్యానికి తలొగ్గిన లక్ష్య రెండో గేమ్ నుంచి ఆటతీరును మార్చుకున్నాడు. దూకుడైన స్మాష్‌లు, మెరుగైన రక్షణాత్మక ఆటతో పుంజుకుని రెండో గేమ్‌ను సొంతం చేసుకున్నాడు. నిర్ణయాత్మక మూడో గేమ్‌లోనూ అదే జోరు కొనసాగించి సెమీఫైనల్ బెర్తును ఖరారు చేసుకున్నాడు. ఒకే టోర్నమెంట్‌లో ముగ్గురు భారత షట్లర్లు సెమీఫైనల్‌కు చేరుకోవడంతో టైటిల్‌పై ఆశలు పెరిగాయి. మహిళల సింగిల్స్‌లో సింధు, అన్మోల్ మధ్య జరిగే పోరు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్ కూడా ఫైనల్‌కు చేరాలనే పట్టుదలతో ఉన్నాడు. సింధు అనుభవం.. అన్మోల్ యువ దూకుడు.. లక్ష్య సేన్ పోరాటపటిమతో హైలో ఓపెన్‌లో భారత బ్యాడ్మింటన్ సందడి కొనసాగుతోంది.



సమంతకు కవల పిల్లలా..

కృతి కర్బందా కామెంట్‌తో మొదలైన కొత్త చర్చ!

హైదరాబాద్, అక్టోబర్ 31 : టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం తన వ్యక్తిగత జీవితంతో పాటు సినిమాల విషయంలోనూ నిరంతరం వార్తల్లో నిలుస్తున్నారు. ఫిట్‌నెస్‌కు ఎంతో ప్రాధాన్యత ఇచ్చే సమంత, ఎంత బిజీగా ఉన్నప్పటికీ వ్యాయామం, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. తాజాగా తన వర్కౌట్ ప్రయాణానికి సంబంధించిన ఒక వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేయడంతో అది వైరల్‌గా మారింది. అయితే ఈ వీడియో కంటే హీరోయిన్ కృతి కర్బందా చేసిన ఒక చిన్న కామెంట్ ఇప్పుడు నెట్టింట పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. సమంత తాజాగా తన వ్యాయామ ప్రయాణానికి సంబంధించిన వీడియోను అభిమానులతో పంచుకుంటూ, మొదటి నెల నుంచి తొమ్మిదో నెల వరకు సాగిన వర్కౌట్ దృశ్యాలను అందులో చూపించారు. ఈ వీడియోకు 'ది ఫైనల్ ల్యాప్' అంటూ సమంత ఆసక్తికరమైన క్యాప్షన్ జోడించారు. దీంతో అభిమానులు, సినీ ప్రముఖులు ఆమెకు అభినందనలు తెలియజేస్తూ కామెంట్లు చేస్తున్నారు. అయితే ఈ పోస్టుపై హీరోయిన్ కృతి కర్బందా స్పందిస్తూ.. 'సెండింగ్ ఆల్ 3 ఆఫ్ యూ సో మచ్ లవ్' (మీ ముగ్గురికీ ఎంతో ప్రేమను పంపిస్తున్నాను) అంటూ కామెంట్ చేశారు. దీంతో ఈ ముగ్గురు ఎవరు, కృతి అలా ఎందుకు కామెంట్ చేశారు అంటూ నెటిజన్లు ఆరా తీయడం మొదలుపెట్టారు. కృతి కర్బందా చేసిన కామెంట్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చకు కారణమైంది. కొందరు సమంత, ఆమె భర్త, పుట్టబోయే బిడ్డను ఉద్దేశించే కృతి అలా కామెంట్ చేసి ఉంటారని భావిస్తుండగా, మరికొందరు మాత్రం సమంతకు కవల పిల్లలు పుట్టబోతున్నారనే సంకేతమా అంటూ ఊహాగానాలు చేస్తున్నారు. అయితే కృతి కర్బందా తన కామెంట్‌లో అసలు ఎవరిని ఉద్దేశించారనే విషయంపై ఎలాంటి స్పష్టత లేదు. ఆమె సరదాగా చేసిన వ్యాఖ్యకు నెటిజన్లు రకరకాల అర్థాలు తీస్తున్నారు. దీంతో సమంతకు కవల పిల్లలు పుట్టబోతున్నారంటూ సోషల్ మీడియాలో ప్రచారం మొదలైంది. ఈ వార్తల్లో ఎంతవరకు నిజం ఉందనేది తెలియాల్సి ఉంది. దీనిపై సమంత కానీ, కృతి కానీ ఇప్పటివరకు ఎలాంటి వివరణ ఇవ్వలేదు. ఇక సమంత సినిమాల విషయానికి వస్తే, ఆమె చివరిగా 'మా ఇంటి బంగారం' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. మరోవైపు పవన్ కల్యాణ్ నటించిన 'తీన్ మార్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన కృతి కర్బందా ప్రస్తుతం బాలీవుడ్‌లో వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు.



'రంగస్థలం' తర్వాత మరో సంచలనం..

చరణ్-సుకుమార్ సిద్ధం!

నేడు భారీ చిత్రానికి ప్రారంభోత్సవం.. మెగా అభిమానుల్లో ఉత్సాహం

హైదరాబాద్, అక్టోబర్ 31 : మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్, ప్రముఖ దర్శకుడు సుకుమార్ కలయికలో మరో భారీ చిత్రం పట్టాలెక్కేందుకు సిద్ధమవుతోంది. తెలుగు సినీ పరిశ్రమలో సంచలన విజయం సాధించిన 'రంగస్థలం' తర్వాత వీరిద్దరూ మరోసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. నవంబర్ 1న సినిమా ప్రారంభోత్సవం జరగనున్న నేపథ్యంలో దర్శకుడు సుకుమార్ భార్య తబితా సుకుమార్ సామాజిక మాధ్యమాల్లో పెట్టిన ఆసక్తికర సందేశం అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. ఈ సినిమా కోసం తన భర్త పడిన కష్టాన్ని గుర్తుచేసుకుంటూ ఆమె భావోద్వేగంగా స్పందించారు. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో తబితా సుకుమార్ ఈ కొత్త ప్రాజెక్టుపై ప్రత్యేక సందేశాన్ని పంచుకున్నారు. సుకుమార్ భార్యగా ఈ చిత్రం తనకు ఎంతో గర్వంగా, ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కథను సిద్ధం చేయడానికి సుకుమార్ ఎంత సమయం వెచ్చించారో, ఎన్ని గంటలు శ్రమించారో తనకు తెలుసని తెలిపారు. రచనపై ఆయనకున్న అభిరుచి, అంకితభావం, పట్టుదల ఇప్పుడు ఒక రూపం దాల్చబోతుండటం ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తోందని వివరించారు. ఆయన కష్టానికి తెరపై ప్రతిఫలం దక్కబోతున్న క్షణాలను చూడటం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. రామ్ చరణ్, సుకుమార్ కలయిక అనగానే సినీ అభిమానులకు ముందుగా గుర్తుకొచ్చేది 'రంగస్థలం'. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఆ చిత్రంలో రామ్ చరణ్‌ను సుకుమార్ పూర్తిగా భిన్నమైన పాత్రలో చూపించారు. చిట్టిబాబు పాత్రలో చరణ్ నటనకు ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించింది. కథ, కథనం, పాత్రల రూపకల్పనతో 'రంగస్థలం' తెలుగు సినీ పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. ఇప్పుడు అదే కలయిక మరోసారి ప్రేక్షకుల ముందుకు వస్తుండటంతో ఈసారి ఎలాంటి కథను ఎంచుకున్నారనే ఆసక్తి నెలకొంది. కొత్త చిత్రానికి సంబంధించిన కథ, రామ్ చరణ్ పాత్ర, ఇతర నటీనటుల ఎంపికపై ఇప్పటికే పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే చిత్ర బృందం నుంచి అధికారిక వివరాలు వెల్లడయ్యే



వరకు వీటిపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. తాజాగా తబితా చేసిన వ్యాఖ్యలతో కథ కోసం సుకుమార్ ప్రత్యేకంగా శ్రమించారనే విషయం అభిమానుల్లో చర్చనీయాంశమైంది. దీంతో చిత్రంపై అంచనాలు మరింత పెరిగాయి. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనున్న ఈ భారీ చిత్రం నవంబర్ 1న ప్రారంభం కానున్నట్లు సమాచారం. ప్రారంభోత్సవ కార్యక్రమంలో చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశముంది. ముఖ్యంగా కథా నేపథ్యం, రామ్ చరణ్ పాత్ర స్వభావం, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలపై అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

నా మనసంతా హైదరాబాద్‌లోనే ఉంది

రకుల్ ప్రీత్ సింగ్ ఎమోషనల్ వ్యాఖ్యలు!

హైదరాబాద్, అక్టోబర్ 31 : టాలీవుడ్ సినిమాలతో స్టార్ హీరోయిన్‌గా అపారమైన గుర్తింపు తెచ్చుకుని, ప్రస్తుతం బాలీవుడ్‌తో పాటు పాన్-ఇండియా ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్న ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్ భాగ్యనగరంపై తనకున్న ప్రేమను మరోసారి చాటుకుంది. కెరీర్‌లో ఎక్కడికి వెళ్లినా, ఎన్ని భాషల్లో సినిమాలు చేసినా తన మనసంతా ఎప్పుడూ హైదరాబాద్‌లోనే ఉంటుందని తన మనసులోని మాటను బయటపెట్టింది. నితీష్ తివారీ దర్శకత్వంలో రణ్‌బీర్ కపూర్, రాకింగ్ స్టార్ యష్, సాయి పల్లవి ప్రధాన పాత్రల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న పాన్-వరల్డ్ విజువల్ వండర్ 'రామాయణ' సినిమా ప్రమోషన్లలో భాగంగా చిత్ర బృందం నిర్వహించిన ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో రకుల్ ప్రీత్ సింగ్ పాల్గొంది. ఈ ఇంటర్వ్యూ ప్రారంభంలో యాంకర్ రకుల్‌ను ఆప్యాయంగా పలకరిస్తూ.. "వెల్‌కమ్ రకుల్.. నువ్వు హైదరాబాద్ అమ్మాయివే కదా!" అని అనగానే, రకుల్ ఏమాత్రం ఆలోచించకుండా వెంటనే స్పందించింది. "నిజమే.. నా హృదయం ఎప్పుడూ హైదరాబాద్‌లోనే ఉంటుంది" అంటూ నవ్వుతూ బదులిచ్చింది. తెలుగు చిత్ర పరిశ్రమ ద్వారానే తనకు స్టార్‌డమ్ వచ్చిందని, ఇక్కడి ప్రేక్షకులు చూపించిన అపారమైన ప్రేమాభిమానాలే తనను ఈ స్థాయికి చేర్చాయని తెలిపింది. ఇదే విషయాన్ని గతంలోనూ పలు సందర్భాల్లో రకుల్ గుర్తుచేసుకుంది. ప్రస్తుతం ఏకంగా గ్లోబల్ ప్రాజెక్ట్ 'రామాయణ' ప్రమోషన్లలో పాల్గొంటూ, హైదరాబాద్ వేదికగా ఆమె చేసిన ఈ కామెంట్స్ తెలుగు ఆడియన్స్‌ను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. తెలుగులో మరిన్ని మంచి చిత్రాలు చేయాలని ఉందనే ఆకాంక్షను కూడా ఈ సందర్భంగా ఆమె వ్యక్తం చేసింది. ప్రస్తుతం రకుల్ చెప్పిన ఈ మాటలు సోషల్ మీడియాలో నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటూ తెగ వైరల్ అవుతున్నాయి.

రాజకీయాల వల్లే ప్రకాశ్‌రాజ్‌ని సినిమాల నుంచి తొలగించారు

భార్య పోని వర్మ సంచలన వ్యాఖ్యలు!

హైదరాబాద్, అక్టోబర్ 31 : ప్రముఖ బహుభాషా నటుడు ప్రకాశ్‌రాజ్ తన రాజకీయ, సామాజిక అభిప్రాయాలను నిర్భయంగా వ్యక్తపరచడం వల్ల ఆయన సినీ కెరీర్‌పై తీవ్రమైన ప్రతికూల ప్రభావం పడిందని భార్య, ప్రముఖ కొరియోగ్రాఫర్ పోనీ వర్మ తాజాగా వెల్లడించారు. దేశంలో జరిగే పలు సామాజిక పరిణామాలు, ప్రభుత్వ విధానాలపై ప్రకాశ్‌రాజ్ నిరంతరం ముందుండి ప్రశ్నలు సంధిస్తుంటారు. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా 'జస్ట్ ఆస్కింగ్' అనే హ్యాష్‌ట్యాగ్‌తో ఆయన చేసే పోస్టులు నిత్యం తీవ్ర చర్చనీయాంశం అవుతుంటాయి. అయితే ఈ విధంగా తన మనసులోని మాటను



కుండబద్దలు కొట్టినట్లు చెప్పడం వల్లే ఆయన ఎన్నో అద్భుతమైన అవకాశాలను కోల్పోవాల్సి వచ్చిందని పోనీ వర్మ పేర్కొన్నారు. ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పోనీ వర్మ ఈ ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. మొదట్లో ప్రకాశ్‌రాజ్ రాజకీయాలపై మాట్లాడే విధానం తనను ఎంతో భయపెట్టేదని ఆమె గుర్తుచేసుకున్నారు. ముఖ్యంగా ప్రముఖ జర్నలిస్ట్ గౌరీ లంకేశ్ హత్య ఘటన ప్రకాశ్‌రాజ్‌ను మానసికంగా తీవ్రంగా కలచివేసిందని తెలిపారు. ఆ దురదృష్టకర సంఘటన తర్వాతే ఆయన ఆలోచనా విధానం పూర్తిగా మారిపోయిందని, ఇలా సమాజంలో భయపడుతూ బతకడం ఎందుకు అని ఆయన ప్రశ్నించుకున్నారని చెప్పారు. ఆ క్షణం నుంచే సామాజిక మాధ్యమాల ద్వారా సమాజంలో జరుగుతున్న తప్పులను నిరంతరం ప్రశ్నించడం మొదలుపెట్టారని ఆమె వివరించారు. అయితే ఈ సామాజిక స్పృహ ఆయన సినీ కెరీర్‌కు మాత్రం భారీ మూల్యాన్నే తెచ్చిపెట్టిందని పోనీ వర్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన బహిరంగంగా గళం విప్పడం వల్ల పలు సినిమా అవకాశాలు, బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌లు, వాణిజ్య ప్రకటనల ప్రాజెక్టులు చేజారిపోయాయని చెప్పారు. కొందరు దర్శక-నిర్మాతలు ఆయనకు ఇప్పటికే అడ్వాన్స్‌లు కూడా చెల్లించారని, కానీ రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ఆ తర్వాత ప్రాజెక్టుల నుంచి ఆయనను తొలగించిన సందర్భాలు కూడా ఉన్నాయని ఆమె సంచలన నిజాలను వెల్లడించారు. వృత్తిపరంగా ఆయన ఎంతో నష్టపోయినప్పటికీ, ప్రకాశ్‌రాజ్ మాత్రం తన సిద్ధాంతాల నుంచి ఎప్పుడూ వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. తన మనస్సాక్షికి ఏది తప్పుగా అనిపిస్తుందో దానిని ఎప్పటికీ అంగీకరించకూడదని ఆయన గట్టి నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. ఆర్థికంగా, కెరీర్ పరంగా ఎన్నో నష్టాలు ఎదురైనా తన నమ్మకాల కోసం ఆయన రాజీపడకుండా ముందుకు సాగుతున్నారని తెలిపింది.

Printed, Published and Owned by **V SAMPATH,** and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. **Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146** Email: shenarthimedia@gmail.com. Phone No: **9391343644**